
9వ తరగతి పాఠ్యాంశంగా 'ఎమర్జెన్సీ'..
2



మనం
జనం కోసం అక్షర యజ్ఞం..
గుంటూరు - శుక్రవారం 26 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 172 | పేజీలు: 8+4 | వెల రూ.5
GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |

పాస్‌పోర్టు పౌరసత్వానికి ప్రూఫ్ కాదు
2





# నదుల అనుసంధానంతో తిరుగులేని భారత్

## – సీఎం చంద్రబాబు

కర్ణాటకలోని హోసపేటలో జరిగిన తుంగభద్ర ప్రాజెక్టు 33 కొత్త క్రెస్ట్ గేట్ల ప్రారంభోత్సవంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి సి.ఆర్. పాటిల్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ కలిసి పాల్గొనగా, అంతర్రాష్ట్ర నదుల అనుసంధానంపై చంద్రబాబు కీలక ప్రసంగం చేశారు.

(అమరావతి, పి. మీరా హుస్సేన్ , మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి): తుంగభద్ర డ్యామ్ వద్ద చంద్రబాబు పర్యటన దేశ నేతల్ని ఆలోచనలో పడేసింది. నదుల విలీనంతో హరిత విప్లవాన్ని సాధించాలని బాబు కీలక సందేశం ఇచ్చారు. తుంగభద్ర డ్యామ్ కొత్త గేట్ల ప్రారంభోత్సవం సందర్భంగా కర్ణాటకలోని హోసపేటలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానాన్ని జాతీయ ప్రాజెక్టా చేపట్టాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని బలంగా కోరారు. గంగా, కావేరి నదులను అనుసంధానం చేస్తే భారతదేశం వ్యవసాయ రంగంలో తిరుగులేని శక్తిగా ఎదుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఒకే వేదికపై చర్చించడం చారిత్రాత్మకమని, రైతుల ప్రయోజనాలను కాపాడటానికి రాష్ట్రాలు పరస్పరం సహకరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు.



# ప్రైవేట్ నుండి ప్రభుత్వ పాఠశాలల్లో లక్షకు పైగా విద్యార్థుల చేరిక

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, అభ్యసన ఫలితాలపై దృష్టి సారించాలి
- ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణపై అధ్యయనం చేయండి
- సెప్టెంబర్ 5 నుంచి 9,10 తరగతి విద్యార్థులకు ఏఐ ట్యూటర్ విధానం 2

పాఠశాల విద్యపై సమీక్షలో మంత్రి నారా లోకేష్

## ముద్రగడ పద్మనాభంను పరామర్శించిన సజ్జల



2

## ఏపీలో చిత్ర పరిశ్రమకు పెద్దపీట



2

నందమూరి బాలకృష్ణ నటిస్తున్న 'ఎన్‌బికే 112' చిత్రానికి ముఖ్య అతిథులుగా హాజరై ముహూర్తపు షాట్కు క్లాప్ కొట్టిన మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్

## ఎయిర్‌బౌండ్‌తో ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్ ఒప్పందం

2



## కోడిగుడ్ల కాంట్రాక్టర్ కక్కుర్తి.. రెడ్హ్యాండెడ్గా పట్టుకున్న ఏపీ మంత్రి

(అమరావతి, మనం న్యూస్): ఏపీ మంత్రి కొలుసు పార్థసారథికి కోడిగుడ్ల కాంట్రాక్టర్ అడ్డంగా దొరికిపోయాడు. ఐసీడీఎస్ కోడిగుడ్ల అక్రమ రవాణా చేస్తుండగా మంత్రి రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. వెంటనే ఈ విషయాన్ని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి పార్థసారథి ఏలూరు జిల్లా ముసునూరు వెళ్లారు.. అక్కడ ఓ కార్యక్రమానికి హాజరైన తిరిగి వస్తుండగా.. ...మిగతా 2లో



# నేను ఎవరికీ బినామీని కాదు..

## కాణిపాకం విఘ్నేశ్వరుడి సాక్షిగా రామచంద్రయాదవ్ సత్యప్రమాణం



2

- స్పష్టం చేసిన బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్
- బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా ప్రత్యామ్నాయ రాజకీయ పోరాటం
- బిసివై పార్టీ ఎదుగుదలను ఓర్వలేకే నాపై అసత్య ఆరోపణలు
- కాణిపాకం వినాయకుడి సాక్షిగా స్పష్టం చేసిన రామచంద్ర యాదవ్


# పాస్‌పోర్ట్ ఫీజుల పెంపు

## జులై 1 నుంచి అమలులోకి

ఢిల్లీ, జూన్ 25: పాస్‌పోర్ట్ ఫీజులను కేంద్ర ప్రభుత్వం సవరించింది. 36 పేజీలతో కూడిన పాస్‌పోర్ట్ రుసుమును రూ.1500 నుంచి రూ.2,500 పెంచింది. తత్కాల్ ఫీజును రూ.3,500 నుంచి రూ.5 వేలకు పెంచింది. 60 పేజీల పాస్‌పోర్ట్‌కు ప్రస్తుతం రూ.2వేలు వసూలు చేస్తుండగా ఇక నుంచి రూ.3500 వసూలు చేయనున్నారు. అదే తత్కాల్ ఫీజును రూ.6వేలుగా నిర్ణయించారు. 18ఏళ్ల కన్నా తక్కువ వయసున్న దరఖాస్తుదారులకు కొత్త పాస్‌పోర్ట్ రుసుము ప్రస్తుతం రూ.1000 ఉండగా.. దీనిని రూ.1750కి పెంచారు. సవరించిన ఫీజులు జులై 1 నుంచి అమలులోకి రానున్నట్లు విదేశాంగశాఖ వెల్లడించింది.

**పాస్‌పోర్ట్ కూడా గుర్తింపు పత్రమే - ఈసీ**

పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వాన్ని ...మిగతా 2లో



# స్థానిక సంస్థ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి

- నియోజకవర్గంలో గ్రూప్ రాజకీయాలు ఉండరాదు
- ఇన్ఛార్జ్ పనితీరు పై సీఎం సంతృప్తి ఏడు గ్రామాల్లో టీడీపీ జెండా ఎగరాలి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

మంత్రాలయం, జూన్ 25(మనం న్యూస్): రాబోయే స్థానిక సంస్థ ఎన్నికలకు సిద్ధంగా ఉండి టిడిపి అభ్యర్థులను గెలిపించే బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని మాధవరం లో నియోజకవర్గ స్థాయి కార్యకర్తలు సమావేశానికి జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తో కలిసి ముఖ్య హాజరయ్యారు. ముందుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాధవరం గ్రామంలోని హెలిపాడ్ గ్రౌండ్ కు చేరుకోగానే ...మిగతా 2లో

## విజయవాడ నగరంలోని చెత్త జిందాల్ వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్కు తరలింపు

- ఆటోనగర్లో కంపాక్టర్‌ని ప్రారంభించిన స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ పట్టాభిరామ్

2



# ప్రభుత్వ పాఠశాలకు పెరిగిన క్రేజ్

## మంత్రి లోకేష్ చొరవతో లక్షకు పైగా విద్యార్థుల చేరిక

ఉండవల్లి, జూన్ 25 (మనం న్యూస్): ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది విద్యార్థుల హాజరు, అభ్యసన ఫలితాలపై దృష్టిసారించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల విద్యపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రైవేటు స్కూళ్లనుంచి... ప్రభుత్వ పాఠశాలలకు ఈ ఏడాది 1,06,000 వేల మంది విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందారని ఈ సందర్భంగా అధికారులు వివరించారు. ముఖ్యంగా ప్రాథమికోన్నత పాఠశాలలు 7,620 ఉండగా.. ...మిగతా 2లో

# వెనెజువెలాలో భారీ భూకంపం



## 168కు పెరిగిన భూకంప మృతులు

- 10 అంతస్తుల హోటల్.. శిథిలాల దిబ్బగా :
- ప్రధాని మోడీ దిగ్భ్రాంతి
- తక్షణసాయం : ట్రంప్



కారకస్/ఢిల్లీ/వాషింగ్టన్, జూన్ 25: వెనెజువెలాలో సంభవించిన వరుస భూకంపాలతో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు 168 మంది ప్రాణాలు కోల్పోగా.. 700 మంది వరకు గాయపడ్డారని తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు. రాజధాని నగరం కరాకస్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో భూకంప తీవ్రత ధాటికి భవనాలు కూలిపోవడంతో.. శిథిలాల కింద అనేక మంది చిక్కుకున్నారు. దాంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు.వెనెజువెలాలో వరుస భూకంపాలు సృష్టించిన విలయం అంతా ఇంతా కాదు. ఈ విపత్తు ధాటికి ఆ దేశం అతలాకుతలమైంది. ప్రాణనష్టం కూడా భారీగానే ఉంది. ముఖ్యంగా తీర నగరమైన 'లా గువైరా' అయితే ఇప్పుడు మరుభూమిని తలపిస్తోంది. అక్కడ ఎటు చూసినా ధ్వంసమైన భవనాల వరుసలే కన్పిస్తున్నాయి. ఇక, ఈ నగరంలోని ప్రముఖ హోటల్ ఒకటి శిథిలాల దిబ్బలా మారింది. లా గువైరాలోని మకుటో ప్రాంతంలో ఉంటే 'హోటల్ ఎడ్వర్డ్' పర్యటకులకు చాలా ఫేమస్. ఎయిర్పోర్టుకు సమీపంలో ఉండే ...మిగతా 2లో

# ఏపీలో చిత్ర పరిశ్రమకు పెద్దపీట




(అమరావతి,పి.మీరాహుస్సేన్, మనం ప్రత్యేక ప్రతినిధి): పద్మభూషణ్,ప్రముఖ సినీనటుడు నందమూరి బాలకృష్ణ 112వ చిత్రం ప్రజా రాజధాని అమరావతిలో ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందని సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గురువారం వెంకటాయపాలెంలో ఏర్పాటు చేసిన 'ఎన్బీకే 112' చిత్రం ముహూర్తపు వేడుకకు ముఖ్య అతిథులుగా సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, మంత్రి నారాలోకేష్ లు హాజరయ్యారు.శాస్త్రోక్తంగా జరిగిన పూజా కార్యక్రమం అనంతరం, మంత్రులు నారా లోకేష్, కందుల దుర్గేష్ లు స్క్రిప్టు చిత్ర బృందానికి అందించారు. ముహూర్తపు షాట్కు మంత్రులు క్లాప్ కొట్టి, కెమెరా స్విచ్చాన్ చేయగా.. మంత్రి దుర్గేష్ 'యాక్షన్' చెప్పారు. ఈ సందర్భంగా హీరో నందమూరి బాలకృష్ణకు, చిత్ర బృందానికి మంత్రులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..తెలుగు చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.ఏపీలో స్టూడియోల నిర్మాణం, రీ-రికార్డింగ్ థియేటర్లు, డబ్బింగ్ థియేటర్ల వంటి మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హీరో బాలకృష్ణ ప్రోత్సాహంతో ఇటీవలే భరత్ భూషణ్ ఛైర్మన్ గా ఎఫ్ డీసీ కార్యవర్గం ఏర్పాటు చేశామన్నారు. ఏపీ రాజధాని వేదికగా ఒక పెద్ద సినిమా గ్రాండ్ గా లాంఛ్ అవ్వడం, అధిక భాగం షూటింగ్ ఏపీలో చిత్రీకరిస్తామనడం శుభపరిణామమన్నారు. ఆంధ్రప్రదేశ్లో తెలుగు చిత్ర పరిశ్రమ స్థిరపడేందుకు ఇదొక బలమైన పునాది అన్నారు. చెరుకూరి సుధాకర్, మిక్కిలినేని సుధాకర్ ల నిర్మాణ సారథ్యంలో కొరటాల శివ దర్శకత్వంలో సాంకేతిక నిపుణుల సమక్షంలో అద్భుతమైన కథతో, నటవర్గంతో తెరకెక్కుతున్న నందమూరి బాలకృష్ణ 'ఎన్బీకే 112' చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకొని ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద అఖండ విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఏపీలో తెలుగు చలనచిత్ర పరిశ్రమ వేళ్లూనుకోవాలని, గతంలో ఘన చరిత్ర కలిగిన విజయవాడలో మళ్లీ ఈ పరిశ్రమను మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలో నవ్యాంధ్రలో సినిమా పరిశ్రమ అభివృద్ధికి సినిమాటోగ్రఫీ మంత్రిగా సర్వశక్తులూ ఒడ్డుతానన్నారు.

# స్థానిక సంస్థ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

మంత్రాలయం టిడిపి ఇన్చార్జ్ ఎన్ .రాఘవేంద్ర రెడ్డి , టిడిపి అధ్యక్షురాలు గుడిసె ఆదికృష్ణమ్మ , ఎంపీ బస్తిపాటి నాగరాజు పుష్పగుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సభా వేదికకు ముఖహాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రానున్న పంచాయతీ , జెడ్పీటీసీ , ఎంపిటిసి ఎన్నికల్లో అందరూ కలిసి కట్టుగా ఉండి టీడీపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో గ్రూప్ రాజకీయలకు స్వస్తి పలకాలన్నారు. పార్టీ వెన్నెదన్నుగా నిలిచి కష్ట కాలంలో పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్త కు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. మంత్రాలయం ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి ఇప్పటి వరకు పనితీరు బాగుందని , ఇంకా పనితీరు మెరుగుపచుకోవాలన్నారు. మాజీ మంత్రి బి మోహన్ రెడ్డి చెప్పడంతోనే అప్పట్లో ప్రస్తుతం ఎమ్మెల్యే కు టికెట్ ఇవ్వడం జరిగిందని గెలిచిన మూడు నెలల్లోనే పార్టీకి వెన్నుపోటు పొడిచారని ఎద్దేవా చేశారు. ఇక్కడి ఎమ్మెల్యే అరాచకాలకు త్వరలోనే అడ్డుకట్ట వేస్తామని స్థానిక సంస్థ ఎన్నికల్లోనే ఆయనకు బుద్ధి చెప్పడం జరుగుతుందన్నారు.ప్రతి కార్యకర్త రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో గెలవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్చార్జ్ బి లక్ష్మన్న , బీజేపీ పార్టీ ఇన్చార్జ్ విష్ణువర్ధన్ రెడ్డి , సుప్రీం న్యాయవాది పురుషోత్తం రెడ్డి , టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి పాలకుర్తి తిక్కా రెడ్డి ,మంచాల సొసైటీ చైర్మన్ ఎన్. రామకృష్ణారెడ్డి , మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి , సీనియర్ నాయకులు పన్నగా వెంకటేష్ స్వామి , టిడిపి యువ నాయకులు అమర్నాథ్ రెడ్డి , ఎన్. రాకేష్ రెడ్డి , కృష్ణమోహన్ రెడ్డి , ఎన్. రాజారెడ్డి , ఎస్ఎం గోపాల్ రెడ్డి , చావిడి వెంకటేష్ , చాపల నాగేష్ , మాలపల్లి లక్ష్మన్న , చంద్ర సూగురు నరసింహ , పట్టణ అధ్యక్షుడు వరదరాజు , కమ్మసాలి నరసింహ , ఎంపిటిసి బోయ క్లస్టర్ ఇన్చార్జ్ పవన్ కుమార్ , వెంకటేష్ , మద్రి రాఘవేంద్ర , శివ కుమార్ , నాలుగు మండల టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎయిర్బౌండ్ తో ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్ ఒప్పందం

న్యూఢిల్లీ,జూన్,25,(మనం న్యూస్): బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలను నిర్వహిస్తోన్న ఏరోస్పేస్ సంస్థ అయిన ఎయిర్బౌండ్, అమరావతి రాజధాని ప్రాంతం అంతటా విస్తరించగల డ్రోన్ డెలివరీ నెట్వర్కు అభివృద్ధి చేయడానికి ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్ (ఏపీడీసీ)తో ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుంది. ఇది భారతదేశంలో వైమానిక లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాల నిర్మాణ దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు. ఈ అవగాహన ఒప్పందంపై భారత పౌర విమానయాన శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడు సమక్షంలో ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు చైర్మన్ గీతాంజలి శర్మ, ఎయిర్బౌండ్ వ్యవస్థాపకుడు సీఈఓ నమన్ పుష్ప్ సంతకాలు చేశారు. డ్రోన్ ఆధారిత ఆవిష్కరణలు , అధునాతన లాజిస్టిక్స్కు ప్రపంచ కేంద్రంగా ఎదగాలన్న ఆంధ్రప్రదేశ్ యొక్క ఆకాంక్షను ఈ భాగస్వామ్యం ప్రతిబింబిస్తుంది. ప్రతిపాదిత అమరావతి క్యాపిటల్ రీజియన్ డ్రోన్ డెలివరీ నెట్వర్క్ (ఏసిఆర్ డిడిఎన్)లో భాగంగా, అమరావతి, విజయవాడ మరియు గుంటూరులను కలుపుతూ డ్రోన్ కార్యకలాపాలను ప్రారంభించేందుకు ఎయిర్బౌండ్ సంస్థ ఆరోగ్య సంరక్షణ, లాజిస్టిక్స్ మరియు ఇ కామర్స్ రంగాలలోని భాగస్వాములతో కలిసి పనిచేయనుంది. ఈ కార్యక్రమం, గుంటూరులో కార్యకలాపాలతో ప్రారంభమవుతుందని భావిస్తున్నారు. రాబోయే సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రోజుకు 10,000 డ్రోన్ ఫ్లైట్స్ ను ప్రారంభించేందుకు ఇరు పక్షాలు కలిసి పనిచేయనున్నాయి. ఈ స్థాయి, ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద వాణిజ్య డ్రోన్ డెలివరీ నెట్వర్కుల్లో రాష్ట్రాన్ని ఒకటిగా నిలబెట్టగలదు. భారీ స్థాయి వైమానిక లాజిస్టిక్స్ కోసం రూపొందించబడటంతో, సాంప్రదాయ పద్ధతుల కంటే 20 రెట్లు తక్కువ ఖర్చుతో ఇది వస్తువులను చేరవేయగలదు. తద్వారా, విస్తృత భౌగోళిక ప్రాంతాలలో వేగవంతమైన, నమ్మకమైన మరియు సరసమైన ప్రవేశాన్ని ఇది సాధ్యం చేస్తుంది. ఈ భాగస్వామ్యం ఆరోగ్య సంరక్షణ సామాగ్రి, వాణిజ్య వస్తువులు మరియు కీలకమైన డెలివరీల వేగవంతమైన రవాణాకు తోడ్పడటంతో పాటు, పట్టణ మరియు నగర ప్రాంతాలలో మిడ్ మైల్ కనెక్టివిటీ, కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుందని భావిస్తున్నారు. అంతేకాకుండా, రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న డ్రోన్ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు, పర్యావరణ వ్యవస్థ అభివృద్ధి, ఉపాధి కల్పన, ఆవిష్కరణలకు ఇది అవకాశాలను సృష్టిస్తుందని కూడా అంచనా వేస్తున్నారు. భారత ప్రభుత్వ పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్ మోహన్ నాయుడు మాట్లాడుతూ ఎయిర్బౌండ్ యొక్క ప్లాట్ఫామ్, తదుపరి తరం విమానయాన రంగంలో భారతదేశం సాధించగల స్వదేశీ ఆవిష్కరణను చూపిస్తుంది. స్వదేశీ సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకుని ప్రపంచంలోని అతిపెద్ద డ్రోన్ డెలివరీ నెట్వర్కుల్లో ఒకదానిని నిర్మించడం ద్వారా, అత్యాధునిక సాంకేతికతను భారతదేశంలోనే రూపొందించి, నిర్మించి, విస్తరించవచ్చని, మన ప్రజలకు నిజమైన కనెక్టివిటీ, ఉద్యోగాలు మరియు వృద్ధిని అందించవచ్చని ఆంధ్రప్రదేశ్ నిరూపిస్తోంది అన్నారు.

ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ చైర్మన్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందంతో, ఎయిర్బౌండ్ కేవలం ఒక కొత్త డెలివరీ విధానాన్ని ప్రారంభించడమే కాదు, ఆంధ్రప్రదేశ్ కోసం ఒక కొత్త లాజిస్టిక్స్ నిర్మాణానికి పునాదులు వేస్తోందన్నారు. ఎయిర్బౌండ్ యొక్క సాంకేతికతను , అధునాతన మౌలిక సదుపాయాలపై మాకున్న దృష్టితో జోడించటం ద్వారా అమరావతి, విజయవాడ మరియు గుంటూరు జిల్లాలలోని నివాసితులు మరియు వ్యాపార సంస్థలు డ్రోన్ ఆధారిత సేవల ప్రయోజనాలను త్వరగా పొందేలా చేయగలము అని చెప్పారు. ఎయిర్బౌండ్ వ్యవస్థాపకుడు , సీఈఓ నమన్ పుష్ప్ మాట్లాడుతూ, లాజిస్టిక్స్ మరియు ఏరియల్ మొబిలిటీ పరంగా భారతదేశం ఒక కీలక మలుపు వద్ద ఉంది. ఈ పరివర్తనకు పెద్ద ఎత్తున నాయకత్వం వహించడానికి అవసరమైన ఆశయం, అనుకూలమైన వాతావరణం రెండూ ఆంధ్రప్రదేశ్కు ఉన్నాయి. ఈ భాగస్వామ్యంతో, మేము కేవలం మరో డెలివరీ ఎంపికను జోడించడం లేదు, వస్తువుల రవాణా స్వరూపాన్నే మార్చబోతున్నాము అని చెప్పారు.

# విజయవాడ నగరంలోనిచెత్త జిందాల్ వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్కు తరలింపు

విజయవాడ,జూన్,25,(మనం న్యూస్) : విజయవాడ నగరంతోపాటు ఆటోనగర్ లో రోజూ వచ్చే చెత్తని జిందాల్ వేస్ట్-టు-ఎనర్జీ ప్లాంట్కు తరలించే ఏర్పాటు చేసినట్లు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ చెప్పారు. ఆటోనగర్ లో నూతన కంపాక్టర్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ, మెరుగైన చెత్త సేకరణ, సమర్థవంతంగా వ్యర్థ నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతకు ఈ కంపాక్టర్ ఉపయోగపడుతుందన్నారు. 42 క్యూబిక్ మీటర్ల ఈ కంపాక్టర్ కు 50 శాతం నిధులను స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ అందించినట్లు తెలిపారు. స్థానిక శాసనసభ్యులు గద్దె రామమోహన్ రావు, తమ పార్టీ యువనేత గద్దె క్రాంతి కుమార్, ఆటోనగర్ అసోసియేషన్, ఇలా పెద్దలు ఇక్కడి చెత్త సమస్యను తన దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈ సమస్య పరిష్కారం విషయమై వారు తనతో చర్చించినట్లు తెలిపారు. ఆటోనగర్ ప్రాంతంలోని చెత్తని జిందాల్ ప్లాంట్కు తరలించే విషయంలో కొన్ని ఇబ్బందులు తలెత్తాయని తెలిపారు. సమస్య తనకు తెలిసిన వెంటనే జిందాల్ ప్లాంట్ వారితో, మున్సిపల్ శాఖా మంత్రి డాక్టర్ పొంగూరి నారాయణ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్మెంట్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, స్థానిక మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్రలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో ప్రతిరోజూ 10 నుంచి 12 టన్నుల చెత్త వస్తుందని, ఆ మొత్తాన్ని జిందాల్ ప్లాంట్ కు తరలించడానికి తాత్కాలికంగా ఒప్పించినట్లు చెప్పారు. త్వరలో ఆటోనగర్ పెద్దలతో ఒక సమావేశం ఏర్పాటు చేసి, వారి సలహాలు కూడా తీసుకుని, ఇక్కడ చెత్త పేరుకుపోకుండా, ఏరోజు చెత్త ఆ రోజు తరలించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఎండీ ఏఎస్ దినేష్ కుమార్, జోనల్ మేనేజర్ కుంచె బాబ్జీ తదితరులను తాను ఇక్కడకు తీసుకువచ్చి, చెత్త ట్రాన్స్ పోర్ట్ సమస్యను వారికి వివరించి, పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడ ఉన్న ట్రాక్టర్ స్టేషన్ ని కూడా త్వరలోనే మరో ప్రదేశానికి తరలించే ఏర్పాటు చేస్తానన్నారు. ఈ విషయమై ఏపీఐఐసీ వారితో కూడా మాట్లాడినట్లు చెప్పారు.

ఆటోనగర్ లో చెత్త సమస్యపై ప్రత్యేక దృష్టిపెట్టి, ఈ సమస్య మళ్లీ ఉత్పన్నం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ ప్రాంతాలలో చెత్త సమస్యలపై వార్తలు రాసి, తమ దృష్టికి తీసుకువచ్చి, ఆ సమస్యలు పరిష్కారమయ్యే విధంగా ఎంతో బాధ్యతతో వ్యవహరిస్తున్న మీడియా వారిని చైర్మన్ పట్టాభిరామ్ ప్రత్యేకంగా అభినందించారు. జోనల్ మేనేజర్ కుంచె బాబ్జీ, గద్దె క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# తొమ్మిదో తరగతి పాఠ్యాంశంగా 'ఎమర్జెన్సీ'..

## స్వాగతించిన బీజేపీ

ఢిల్లీ, జూన్ 25: దేశంలో 1975లో విధించిన ఎమర్జెన్సీ పరిస్థితులను.. తొమ్మిదో తరగతి సాంఘిక శాస్త్రంలో పాఠంగా చేరుస్తూ ఎన్సీఈఆర్టీ తీసుకున్న నిర్ణయాన్ని భారతీయ జనతా పార్టీ స్వాగతించింది. భారత రాజ్యాంగంలో అదొక చీకటి అధ్యాయమని.. ఆ సమయంలో ప్రాథమిక హక్కలకు తీవ్ర ఆటంకం కలిగిందని పేర్కొంది. దాని గురించి నేటి తరం విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

ఎన్సీఈఆర్టీ కొత్తగా రూపొందించిన 9వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్య పుస్తకంలో జాతీయ ఎమర్జెన్సీని చేర్చారు. ఆ సమయంలో దేశం ఎదుర్కొన్న సవాళ్లను ప్రస్తావించారు. దీనిపై ప్రతిపక్ష పార్టీల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా స్పందిస్తూ.. కాంగ్రెస్ పార్టీపై మండిపడ్డారు. 1975 జూన్ 25 చీకటి రోజు అని.. అధికారాన్ని వినియోగించుకుని అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ఎమర్జెన్సీకి తెరలేపారని విమర్శించారు. ఆ సమయంలో అన్ని రాజ్యాంగ సంస్థలు, మీడియాపై ఆంక్షలు విధించారని మండిపడ్డారు. ఆల్ ఇండియా రేడియో నుంచి కిశోర్ కుమార్ పాటలు కూడా తొలగించారని తెలిపారు. ఈ అధ్యాయాన్ని పాఠ్యాంశంగా చేర్చడం వల్ల అప్పట్లో జరిగిన విషయాలు విద్యార్థులు తెలుసుకుని.. భవిష్యత్తులో అలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్త పడతారని అన్నారు. ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ అదే 'ఎమర్జెన్సీ మైండ్సెట్'తో ఉందని ఎద్దేవా చేశారు.

# ముద్రగడ పద్మనాభంను పరామర్శించిన సజ్జల

హైదరాబాదు,జూన్,25,(మనం న్యూస్): కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం గారిని వైఎస్సార్సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి గురువారం హైదరాబాద్లో పరామర్శించారు.

వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఆదేశాల మేరకు హైదరాబాద్లోని సింధు ఆసుపత్రికి వెళ్లిన సజ్జల రామకృష్ణారెడ్డి, గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ముద్రగడ పద్మనాభం గారిని కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అందిస్తున్న చికిత్స వివరాలను తెలుసుకుని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముద్రగడ పద్మనాభం కుమారుడు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్ఛార్జ్ ముద్రగడ గిరిబాబు, కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. పార్టీ తరఫున పూర్తి సహాయ సహకారాలు అందుబాటులో ఉంటాయని వారికి భరోసా కల్పించారు.ముద్రగడ పద్మనాభం గారు పూర్తిగా కోలుకుని త్వరలోనే ప్రజల మధ్యకు రావాలని వైయస్ జగన్మోహన్రెడ్డి ఆకాంక్షించినట్లు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. అలాగే ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజా జీవితంలో చురుకుగా కొనసాగాలని సజ్జల రామకృష్ణారెడ్డి ఆకాంక్షించారు.

# ప్రభుత్వ పాఠశాలకు పెరిగిన క్రేజ్

(మొదటి పేజీ తరువాయి)

3,515(46.13%) పాఠశాలల్లో గరిష్ట సామర్థ్యం మేర విద్యార్థుల ప్రవేశాలు పొందారని చెప్పారు. విద్యారంగంలో సంస్కరణల ఫలితంగానే విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయన్నారు. ఈ ఏడాది 159 పాఠశాలలు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా రూపాంతరం చెందాయని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణపైనా సమావేశంలో చర్చించారు. అధిక ఫీజుల నియంత్రణకు ఇతర రాష్ట్రాలు అవలంబిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు.

ఈ ఏడాది సెప్టెంబర్ 5 నుంచి ఫేజ్-1 కింద 175 లీప్ పాఠశాలల్లో 9,10 తరగతుల విద్యార్థులకు మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులకు సంబంధించి ఏఐ ట్యూటర్ విధానాన్ని ప్రి పైలట్ ప్రాజెక్ట్ గా చేపట్టనున్నట్లు అధికారులు వివరించారు. భవిష్యత్ లో క్లిక్కర్స్ కు ఏఐ ట్యూటర్ ను అనుసంధానించాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. ఐఈఆర్ పీఎస్ రెగ్యులరైజేషన్, హై స్కూల్ ప్లస్ లలో గెస్ట్ లెక్చరర్ల రిక్రూట్ మెంట్ అంశంపైనా సమావేశంలో చర్చించారు.

### త్వరలో అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ

అమరావతిలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీతో పాటు విశాఖలో డిస్ట్రిక్ట్ సెంట్రల్ లైబ్రరీ, మంగళగిరిలో స్కిల్ ఎక్స్ లెన్స్ సెంటర్ ఏర్పాటుపైనా సమావేశంలో చర్చించారు. ఇందుకు సంబంధించిన భవన నమూనాలను మంత్రి పరిశీలించి పలు సూచనలు చేశారు. వచ్చే నెలలో అమరావతిలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీకి శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి (ఇన్ ఛార్జి) శ్యామలరావు, పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా, విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండి దీవెన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కోడిగుడ్ల కాంట్రాక్టర్ కక్కుర్తి.. రెడ్హ్యాండెడ్గా పట్టుకున్న ఏపీ మంత్రి

(మొదటి పేజీ తరువాయి)

నూజివీడు మండలం తుక్కులూరు దగ్గర ఆగారు. మంత్రి టీడీపీ కార్యకర్తలతో మాట్లాడుతన్న సమయంలో అంగన్వాడీ సెంటర్లకు కోడిగుడ్లు సరఫరా చేసే వాహనం అటువైపుగా వచ్చింది. ఆయనకు ఆ వాహనాన్ని చూసి ఎందుకో అనుమానం వచ్చింది. మంత్రి పార్థసారథి ఆ వాహనాన్ని ఆపి కోడిగుడ్లు ఎక్కడికి తీసుకెళ్తున్నారని డ్రైవర్ను ప్రశ్నించారు. అతడు తడబడ్డాడు, పొంతన లేని సమాధానాలు చెప్పాడు. వెంటనే వాహనంలో ఉన్న కోడిగుడ్లను పరిశీలించి స్టాంప్ ఎందుకు లేదని ప్రశ్నించారు. అంగన్వాడీ కేంద్రాలలో గుడ్లు ఇవ్వకుండానే ఇచ్చినట్లుగా.. స్టాక్ రికార్డుల్లో ఖాళీ పేపర్లపై సంతకాలు చేసి ఉండటాన్ని మంత్రి గమనించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు గుడ్లు ఇవ్వకుండా ఇలా అక్రమ రవాణా చేస్తున్నారని తేలింది. చిన్నారులు, గర్భిణులకు చెందాల్సిన పౌష్టికాహారం పక్కదారి పడుతుండటంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంత్రి వెంటనే నూజివీడు సీడీపీవో విజయకుమారికి పార్థసారథి వీడియోకాల్ చేసి కోడిగుడ్లతో పాటుగా వాహనాన్ని కూడా చూపించారు. 'మీరు కూడా సీపీడీవో కూడా తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారు' అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకుని.. ఆ కాంట్రాక్టు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. కోడిగుడ్లు తరలిస్తున్న వాహనాన్ని పోలీసు ఎస్కార్ట్తో నూజివీడులోని ఐసీడీఎస్ కార్యాలయానికి తీసుకెళ్లారు. అలాగే ఈ కోడిగుడ్ల అక్రమ రవాణా అంశాన్ని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో బాధ్యులపై చర్యలు తీసుకుంటామని మంత్రి సంధ్యారాణి తెలిపారు.

ఏపీ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు కోడిగుడ్లను సరఫరా చేసే బాధ్యతను కాంట్రాక్టర్లకు అప్పగించింది. కాంట్రాక్టర్లు ఎప్పటికప్పుడు అంగన్వాడీ కేంద్రాలకు గుడ్లు సరఫరా చేయాల్సి ఉంటుంది.. కానీ మంత్రికి దొరికిపోయిన కాంట్రాక్టర్ కోడిగుడ్లను సరఫరా చేయకుండా ఇలా చేసినట్లు సంతకాలు తీసుకుని అక్రమంగా వాటిని రవాణా చేస్తున్నట్లు తేలింది.

# పాస్పోర్టు పౌరసత్వానికి ప్రూఫ్ కాదు

## కేంద్ర విదేశాంగ శాఖ ప్రకటన

ఢిల్లీ, జూన్ 25: పాస్పోర్ట్ అనేది పౌరసత్వాన్ని నిర్ధరించే పత్రం కాదని కేంద్ర విదేశాంగశాఖ చేసిన ప్రకటన తీవ్ర చర్చనీయాంశమైంది. దీనిపై ప్రతిపక్షాల నుంచి విమర్శలు రావడంతో తాజాగా ఆ మంత్రిత్వ శాఖ స్పందిస్తూ వివరణ ఇచ్చింది. పాస్పోర్ట్ను ఎప్పుడూ పౌరసత్వానికి ప్రూఫ్గా చూడలేదని వివరణ ఇచ్చింది. గత 12 ఏళ్లలో అటువంటి నిర్ణయం ఏదీ తీసుకోలేదని వెల్లడించింది. పౌరులు కాని వారికి కూడా పాస్పోర్ట్ను జారీ చేసే వెసులుబాటు చట్టంలో ఉందని తెలిపింది. అది ఉందంటే పౌరసత్వాన్ని నిర్ధరించినట్టు కాదని 2013లో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును గుర్తుచేసింది.


పాస్పోర్ట్ అనేది పౌరసత్వాన్ని నిర్ధరించే పత్రం కాదని 14వ 'పాస్పోర్ట్ సేవా దివస్' సందర్భంగా భారత విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించిన సంగతి తెలిసిందే. పాస్పోర్ట్లు ప్రధానంగా అంతర్జాతీయ ప్రయాణాలను సులభతరం చేయడానికి ప్రభుత్వం జారీ చేసే ప్రయాణ పత్రాలు మాత్రమే అని పేర్కొంది. భారతీయ పాస్పోర్ట్పై ఒక సూచన కూడా ఉంటుంది. దాని ప్రకారం, అవి భారత ప్రభుత్వ ఆస్తిగా పరిగణించబడతాయి. ప్రభుత్వం కోరినప్పుడు వాటిని తప్పనిసరిగా తిరిగి అప్పగించాల్సి ఉంటుంది.

# పాస్పోర్ట్ ఫీజుల పెంపు

(మొదటి పేజీ తరువాయి)

నిర్ధరించే పత్రం కాదని కేంద్ర ప్రభుత్వం పేర్కొనడం తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో ఎన్నికల సంఘం అధికారులు స్పందించారు. దేశంలో జరుగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో చెల్లుబాటయ్యే 12 గుర్తింపు పత్రాల్లో పాస్పోర్ట్ కూడా ఒకటని స్పష్టం చేశారు. ఇటీవల బీహార్, అస్సాం రాష్ట్రాల్లో చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియలోనూ పాస్పోర్ట్ ఓ గుర్తింపు పత్రంగా ఉందని, అందులో ఎటువంటి మార్పు లేదన్నారు.

# ప్రైవేట్ నుండి ప్రభుత్వ పాఠశాలల్లో లక్షకు పైగా విద్యార్థుల చేరిక



తాడేపల్లి, జూన్ 25, మనం న్యూస్: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది విద్యార్థుల హాజరు, అభ్యసన ఫలితాలపై దృష్టిసారించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల విద్యపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రైవేటు స్కూళ్లనుంచి... ప్రభుత్వ పాఠశాలలకు ఈ ఏడాది 1,06,000 వేల మంది విద్యార్థులు కొత్తగా ప్రవేశాలు పొందారని ఈ సందర్భంగా అధికారులు వివరించారు. ముఖ్యంగా ప్రాథమికోన్నత పాఠశాలలు 7,620 ఉండగా.. 3,515(46.13%) పాఠశాలల్లో గరిష్ట సామర్థ్యం మేర విద్యార్థుల ప్రవేశాలు పొందారని చెప్పారు. విద్యారంగంలో సంస్కరణల ఫలితంగానే విద్యార్థుల ప్రవేశాలు పెరిగాయన్నారు.


ఈ ఏడాది 159 పాఠశాలలు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలుగా రూపాంతరం చెందాయని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణపైనా సమావేశంలో చర్చించారు. అధిక ఫీజుల నియంత్రణకు ఇతర రాష్ట్రాలు అవలంబిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 5 నుంచి ఫేజ్-1 కింద 175 లీప్ పాఠశాలల్లో 9,10 తరగతుల విద్యార్థులకు మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులకు సంబంధించి ఏఐ ట్యూటర్ విధానాన్ని ప్రి పైలట్ ప్రాజెక్ట్ గా చేపట్టనున్నట్లు అధికారులు వివరించారు. భవిష్యత్ లో క్లిక్కర్స్ కు ఏఐ ట్యూటర్ ను అనుసంధానించాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. ఐఈఆర్ పీఎస్ రెగ్యులరైజేషన్, హై స్కూల్ ప్లస్ లలో గెస్ట్ లెక్చరర్ల రిక్రూట్ మెంట్ అంశంపైనా సమావేశంలో చర్చించారు.

### త్వరలో అమరావతిలో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి శంకుస్థాపన

అమరావతిలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీతో పాటు విశాఖలో డిస్ట్రిక్ట్ సెంట్రల్ లైబ్రరీ, మంగళగిరిలో స్కిల్ ఎక్స్ లెన్స్ సెంటర్ ఏర్పాటుపైనా సమావేశంలో చర్చించారు. ఇందుకు సంబంధించిన భవన నమూనాలను మంత్రి పరిశీలించి పలు సూచనలు చేశారు. వచ్చే నెలలో అమరావతిలో స్టేట్ సెంట్రల్ లైబ్రరీకి శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి (ఇన్ ఛార్జి) శ్యామలరావు, పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా, విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండి దీవెన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో ఆ పోస్టర్లు చూసి.. 10 లక్షల ఓట్లు వస్తాయన్నారు

## ఇటలీ ప్రధాని జార్జియా మెలోని



రోమ్, జూన్ 25: ఇటలీ ప్రధాని జార్జియా మెలోనికి భారత్పై ప్రత్యేక అభిమానం. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలే అందుకు నిదర్శనం. ఇటీవల ఆ దేశ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోడీ ఆమెకు 'మెలోడీ' చాక్లెట్లు కానుకగా ఇచ్చిన దృశ్యాలు వైరల్గా మారాయి. తాజాగా తన పుస్తకంలో భారత్ పర్యటన గురించి ప్రస్తావించి మన దేశంపై తన అభిమానాన్ని చాటుకున్నారు.

మెలోని తన కొత్త పుస్తకం ' జార్జియా విజన్'లో భారత్ పర్యటన గురించి రాసుకొచ్చారు. పర్యటన సందర్భంగా ఆమెకు స్వాగతం పలుకుతూ రోడ్డుకు ఇరువైపులా భారీగా పోస్టర్లు ఏర్పాటు చేశారు. ఢిల్లీలో ప్రయాణిస్తుండగా పక్కనే ఉన్న ఉప ప్రధాని ఆంటోనియో తజని ఓ సరదా వ్యాఖ్య చేశారట. ఈ పోస్టర్లు చూస్తుంటే.. ఢిల్లీ నియోజకవర్గం నుంచి మీరు పోటీ చేస్తే కనీసం 10 లక్షల ఓట్లు వచ్చేలా ఉన్నాయని ఆయన చమత్కరించారట. ఈ విషయాన్ని మెలోని పుస్తకంలో ప్రస్తావించారు. ''నేను ఢిల్లీలో అడుగుపెట్టగానే.. స్వాగతం పలుకుతూ పోస్టర్లు వెలిశాయి. అలా రోడ్డు మీద వెళ్తున్న కొద్దీ అడుగడుగునా కనిపించాయి. అన్ని పోస్టర్లలోనూ ఒకటే ఫొటో. చాలా ఆనందంగా అనిపించింది. థ్యాంక్స్ టు భారత్'' అంటూ రాసుకొచ్చారు. మెలోని ఇప్పటి వరకు భారత్లో రెండుసార్లు పర్యటించారు. 2023 మార్చిలో 'రైసినా డైలాగ్' పేరిట నిర్వహించిన అంతర్జాతీయ సదస్సుకు హాజరైన ఆమె.. అదే ఏడాది సెప్టెంబర్లో నిర్వహించిన జీ 20 సదస్సుకు హాజరయ్యారు.

# నేను ఎవరికీ బినామీని కాదు..



అమరావతి, జూన్, 25,(మనం ప్రతినిధి): తనపై వస్తున్న నిరాధారమైన ఆరోపణలను బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ తీవ్రంగా ఖండించారు. తాను ఏ రాజకీయ నాయకుడికి, ఏ పార్టీకి బినామీని కాదని స్పష్టం చేస్తూ, ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి సాక్షిగా ఆయన సత్యప్రమాణం చేశారు. 'ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో నాపై వస్తున్న ఆరోపణల గురించి చర్చ జరిగింది. ఆ ఆరోపణలను సవాలుగా స్వీకరించి, ఈరోజు కాణిపాకంలో సత్యప్రమాణం చేస్తున్నాను. నాపై ప్రధానంగా రెండు ఆరోపణలు చేస్తున్నారు. నేను తమిళనాడు మాజీ ముఖ్యమంత్రికి గానీ, వారి సన్నిహితులకు గానీ, మరే ఇతర వ్యక్తులకు, సంస్థలకు గానీ బినామీని కాదని ఈ పవిత్ర పుణ్యక్షేత్రం సాక్షిగా స్పష్టం చేస్తున్నాను. అలాగే, రాష్ట్రంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి గానీ, ఆ పార్టీ అధ్యక్షుడికి గానీ నాకు ఎలాంటి సంబంధం లేదు, నేను వారికి బినామీని అంతకంటే కాదు' అని కుండబద్దలు కొట్టారు.

రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం, ఈ దోపిడీ వ్యవస్థను తరిమికొట్టడం కోసం తాను అలుపెరగని పోరాటం చేస్తున్నానని రామచంద్ర యాదవ్ తెలిపారు. 'బహుజనులకు రాజ్యాధికారం దక్కాలనే దృఢ సంకల్పంతో ముందుకు వెళ్తున్నాను. నా పోరాటాన్ని, బిసివై పార్టీ ఎదుగుదలను చూసి ఓర్వలేక, నన్ను రాజకీయంగా అణగదొక్కాలనే కుట్రతోనే కొందరు నాపై ఇలాంటి అసత్య ఆరోపణలు చేస్తూ విషప్రచారం చేస్తున్నారు. ఈ కుట్రలను పూర్తి స్థాయిలో ఎదుర్కొంటాం. రాష్ట్రంలో బిసివై పార్టీని ఒక బలమైన ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా నిలబెట్టి, బహుజనులకు రాజ్యాధికారం అందించడమే ఏకైక లక్ష్యంగా ముందుకు వెళ్తాం' అని ఆయన ఉద్ఘాటించారు.అంతకు ముందు రామచంద్రయాదవ్ కు కాణిపాకం సర్కిల్ లో భారీ ఎత్తున ఆయన అభిమానులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా కాణిపాకం ఆలయానికి చేరుకున్నారు.


# విమానాశ్రయాల్లో హబ్ అండ్ స్పోక్ సేవలు

ఢిల్లీ, జూన్ 25: రానున్న ఆరు వారాల్లో దేశవ్యాప్తంగా ఆరు విమానాశ్రయాల్లో హబ్ అండ్ స్పోక్ సేవలు ప్రారంభం కానున్నట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. నేడు వారణాసిలో హబ్ అండ్ స్పోక్ సేవలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ.. తొలుత వారణాసి నుంచి ఎయిరిండియా ఈ సేవలను అందిస్తుందని పేర్కొన్నారు. ఈ మోడల్తో భారత్ గ్లోబల్ ఏవియేషన్ హబ్గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రయాణికులకు ఆయన స్వయంగా బోర్డింగ్ పాస్లు ఇచ్చారు. ఈజీ కనెక్ట్ సర్వీసు కింద తొలి ఏఐ1111 విమానం వారణాసి నుంచి ఉదయం 9.30 గంటలకు ఢిల్లీకి బయల్దేరింది.

### హైదరాబాద్లో కూడా ఈ సేవలు..

ఎయిరిండియా సీఈవో, ఎండీ క్యాంప్బెల్ విల్సన్ మాట్లాడుతూ.. ఈజీ కనెక్ట్ ఫ్లైట్ సేవలను త్వరలోనే హైదరాబాద్, చెన్నై, అమృత్సర్, కొచ్చి, గోవాకు విస్తరించనున్నట్లు వెల్లడించారు. ఈ సేవలతో ప్రయాణికులు తమ తొలి ఎయిర్పోర్టులోనే బ్యాగేజీ, ఇమిగ్రేషన్ ప్రాసెస్ పూర్తి చేసుకోవచ్చన్నారు.

# వైభవంగా ప్రారంభమైన శ్రీ పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు



పద్మసరోవరంలో శ్రీ కృష్ణస్వామివారి దివ్య తెప్ప విహారం
భక్తి పారవశ్యంలో తిలకించిన వేలాది మంది భక్తులు

తిరుపతి జూన్ 25 మనం న్యూస్: తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ వార్షిక తెప్పోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ కృష్ణస్వామివారు పద్మసరోవరంలోని సుందరంగా అలంకరించిన తెప్పపై మూడు ప్రదక్షిణలు చేస్తూ భక్తులకు దివ్య మంగళ దర్శనం ప్రసాదించారు.వేడుకగా శ్రీ కృష్ణస్వామివారికి అభిషేకం ఉదయం సుప్రభాతంతో ప్రారంభమైన నిత్యకైంకర్యాల అనంతరం మధ్యాహ్నం శ్రీ కృష్ణస్వామివారి ముఖ మండపంలో స్వామివారికి విశేష అభిషేకం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, సుగంధ ద్రవ్యాలతో నిర్వహించిన ఈ పవిత్ర అభిషేకం భక్తులను ఆధ్యాత్మికానందంలో ముంచెత్తింది.పద్మసరోవరంలో దివ్య తెప్ప విహారంసాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ పద్మపుష్కరిణి వద్దకు వేంచేపు చేశారు. అనంతరం సాయంత్రం 6.30 నుండి రాత్రి 7.15 గంటల వరకు జరిగిన తెప్పోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పద్మసరోవరంలో విద్యుద్దీపాల వెలుగుల్లో సాగిన ఈ దివ్య విహారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.తెప్పోత్సవం అనంతరం శ్రీ కృష్ణస్వామివారు ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగి భక్తులను కరుణాకటాక్షాలతో అనుగ్రహించారు. ఆకట్టుకున్న భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు తెప్పోత్సవాలలో భాగంగా ఆలయ నాలుగు మాడవీధుల్లో నిర్వహించిన భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గోవింద నామస్మరణలతో పాటు సాగిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉత్సవాలకు మరింత శోభను చేకూర్చాయి.ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో డా. ఎ. శరత్, ఆలయ డిప్యూటీ ఈవో హరింద్రనాథ్, సూపరింటెండెంట్లు సురేష్, రమేష్, టెంపుల్ ఇన్స్పెక్టర్ చలపతి, ఇతర అధికారులు, అర్చకులు, శ్రీవారి సేవకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వ్యవసాయ పద్ధతులపై అవగాహన సదస్సు

దేవనకొండ, జూన్ 25 ( మనం న్యూస్ ) మండల పరిధిలోని నెల్లిబండ, కుంకునూరు గ్రామాల రైతులకు ప్రకృతి వ్యవసాయ పై శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు వ్యవసాయ అధికారిని ఉషారాణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమిలో సహజసిద్ధంగా నత్రజని, కార్బన్ పదార్థాలు ఏర్పడి నేల సారవంతంగా తయారవుతుందని, అంతేకాకుండా ఈ పద్ధతి ద్వారా భూమిలో తేమ నిల్వ ఉండి నీరు త్వరగా ఆవిరి కాకుండా కాపాడుతుందని, పి.ఎం.డి.ఎస్ పద్ధతి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, కావున రైతులు స్థానిక ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి ఈ విధానాన్ని అనుసరించాలని తెలియజేస్తున్నాము.



# చంద్రగిరిలో మాయమవుతున్న విలువైన భూములు..!



- నాని పాలనలో రాత్రికి రాత్రే రికార్డులు మాయం
- తిరుపతి రూరల్ తహాశీల్దారు జైలుకు వెళ్లడం ఖాయం

తిరుపతి రూరల్ జూన్ 25మనం న్యూస్: చంద్రగిరి నియోజకవర్గంలో భూములు ఇప్పుడు యజమానుల చేతుల్లో కాకుండా అధికార పార్టీ నేతల చేతుల్లోకి మారిపోయాయి.. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన రెవెన్యూ వ్యవస్థ భూ మాఫియాకు అండగా మారింది.. అవిలాల భూ వ్యవహారంతో ఆ విషయం బయటపడింది.. ఇప్పటి వరకు ఎమ్మెల్యే నాని, ఆయన అనుచరులు ప్రభుత్వ భూములను కబ్జా చేయడం సరిపోలేదన్నట్టు ఇప్పుడు ప్రైవేటు భూములపై కూడా కన్నేశారు.. అధికార బలం.. రెవెన్యూ అధికారుల సహకారంతో ప్రయివేటు భూములను మాయం చేసేస్తున్నారు.. అందుకే ప్రజలారా.. మీ భూములు రికార్డుల్లో వున్నాయా..? లేదా..? ఒకసారి చెక్ చేసుకోండి..'' అంటూ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హెచ్చరించారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవిలాలలో రూ.100 కోట్ల విలువైన 3.17 ఎకరాల భూమి వ్యవహారం సంచలనమవడం, అసలు యజమానుల పేర్లలో ఉన్న భూమి రికార్డులు రాత్రికి రాత్రే మారిపోవడం, మరుసటి రోజే అధికార పార్టీకి అనుబంధంగా ఉన్న వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడం వెనుక భారీ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. భూమి విలువ వంద కోట్లకు చేరుకోవడంతో దీని వెనుక ఎమ్మెల్యే నాని, మంత్రి అనగానిలు ఇద్దరు వున్నట్టు బాధితులు చెబుతున్నారన్నారు. చంద్రగిరిలో ప్రస్తుతం 'భూమి మీదే... కానీ రికార్డు ఎవరిదో చెప్పలేం' అనే పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. ప్రజలు కష్టపడి సంపాదించిన ఆస్తులను కాగితాలపై మాయం చేసి, అధికార పార్టీ నాయకుల బినామీల పేర్లపైకి ఎక్కించే ప్రక్రియ జరుగుతోందని ఆరోపించారు.

# జిల్లాను డ్రగ్ ఫ్రీ చిత్తూరు జిల్లాగా మార్చడమే ధ్యేయం

**చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి**

**1500 మంది విద్యార్థులతో ర్యాలీ నిర్వహించిన జిల్లా ఎస్పీ**




చిత్తూరు జూన్ 25 మనం న్యూస్: 'అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చిత్తూరు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఇతర శాఖల అధికారుల నేతృత్వంలో అనే నినాదంతో మాదకద్రవ్యాల వినియోగం మరియు అక్రమ రవాణాను నిర్మూలించేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిత్తూరు పట్టణంలోని గాంధీ కూడలి వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీలో ఈగల్ టీమ్ సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, సుమారు 1,500 మంది విద్యార్థులు పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భముగా జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ మాదకద్రవ్యాల పై ప్రజలలో ముఖ్యంగా విధ్యార్థిని విద్యార్థులలో అవగాహన కల్పించుటకు జిల్లా పోలీసులు ర్యాలీ నిర్వహించడం జరిగింది. గత కొన్ని సంవత్సరాలుగా మన దేశంలో మాదకద్రవ్యాల వినియోగం చాల పెరిగిందని, వినియోగించే వారిలో యువత ఎక్కువ ఉన్నారని తెలిపారు.

# దొంగతనం కేసు 24 గంటల్లోనే ఛేదన

- ముగ్గురు ముద్దాయిల అరెస్టు
- రూ.93,00,000/- విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం.



తిరుపతి రూరల్ జూన్ 25 మనం న్యూస్: తిరుపతి జిల్లా తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఇంటి దొంగతనం కేసును పోలీసులు కేవలం 24 గంటలలోపే ఛేదించి, ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేసి, రూ.93,00,000/- విలువ గల చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో అదనపు ఎస్పీ ఏ శ్రీనివాసులు (పరిపాలన) వివరాలను వెల్లడించారు.బుధవారం తిరుపతి రూరల్ మండలం చెర్లపల్లి గ్రామం, తాటితోపు, వెంకటపతి నగర్లోని కె.ఆర్. యశోదమ్మ నివాస గృహంలో ఆమె ఇంటిలో లేని సమయంలో నిందితులు ఇంటిలోకి ప్రవేశించి బీరువా తలుపును విరగ్గొట్టి, అందులో భద్రపరిచిన గోద్రేజ్ లాకర్ను అపహరించారు. లాకర్లో సుమారు 600 గ్రాములకుపైగా బంగారు ఆభరణాలు, 1ట కిలోల వెండి వస్తువులు మరియు రూ.50,000/- నగదు ఉండగా వాటిని దొంగిలించి పరారయ్యారు. చోరీకి గురైన ఆస్తి మొత్తం విలువ సుమారు రూ.93,00,000/-గా అంచనా వేయబడింది.ఈ ఘటనపై ఫిర్యాదు అందుకున్న వెంటనే తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకొని, క్రైమ్ ఇన్చార్జ్ అదనపు ఎస్పీ ఎ. శ్రీనివాసులు ఆధ్వర్యంలో, చంద్రగిరి డీఎస్పీ బేతపూడి ప్రసాద్ పర్యవేక్షణలో తిరుపతి రూరల్ సీఐ మద్దయ్యాచారి ప్రత్యేక బృందాలకు నిందితులను గుర్తించి అరెస్టు చేయాలని ఆదేశించారు.దర్యాప్తులో భాగంగా నిందితులను గుర్తించిన పోలీసులు,బుధవారం తిరుపతి చంద్రగిరి బైపాస్ రోడ్డులోని ఒమేగా హాస్పిటల్ సమీపంలోని చెర్లపల్లి సర్కిల్ వద్ద ముగ్గురు ముద్దాయిలను అదుపులోకి తీసుకున్నారు.విచారణలో ప్రధాన నిందితురాలు సోనియా బాధితురాలికి సమీప బంధువు కావడం, గతంలో బాధితురాలి ఇంట్లో ఉండి ఇంటి పరిస్థితులు, ఆభరణాల నిల్వ ప్రదేశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండటం వల్ల ముందస్తు పథకం ప్రకారం నంద్యాల బాబు, ఐలోని అనితలతో కలిసి ఈ చోరీకి పాల్పడినట్లు అంగీకరించింది. ముద్దాయిల వద్ద నుండి చోరీకి ఉపయోగించిన స్కూటర్, గోద్రేజ్ లాకర్ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం లాకర్ను తెరిచి పరిశీలించగా అందులో ఉన్న బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు రూ.50,000/- నగదుతో సహా మొత్తం చోరీ సొత్తును రికవరీ చేశారు. స్వాధీనం చేసుకున్న ఆస్తి మొత్తం విలువ రూ.93,00,000/-గా నిర్ధారించబడింది.కె.ఆర్. యశోదమ్మ, (59) భర్త కె.ఆర్. హరి, డోర్ నెం.3-274, వెంకటపతి నగర్, తాటితోపు, చెర్లపల్లి గ్రామం, తిరుపతి రూరల్ మండలం. ఎ1. పూజారి సోనియా,(28) భర్త లేట్ ఎ. శివ, డోర్ నెం.3-275/అ, వెంకటపతి పురం, చెర్లపల్లి, తిరుపతి రూరల్ మండలం, తిరుపతి జిల్లా.ఎ2. నంద్యాల బాబు,(31)తండ్రి లేట్ ఎన్. తిరుపాల్, డోర్ నెం.2-102/అ, ముత్యాలమ్మ గుడి సమీపంలో, పేరూరు గ్రామం, తిరుపతి రూరల్ మండలం, తిరుపతి జిల్లా.ఎ3. ఐలోని అనిత (26) భర్త దినేష్, డోర్ నెం.6-8-ఖీ-711, గంగమ్మ గుడి సమీపంలో, సింగాలగుంట, తిరుపతి నగరం, ప్రస్తుతం కలెక్టర్కార్యాలయం ఎదురుగా, అనంతపురం నివాసం. ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించి, పూర్తి చోరీ సొత్తును రికవరీ చేయడంలో కీలక పాత్ర పోషించిన తిరుపతి రూరల్ సీఐ మద్దయ్యాచారి, ఎస్ఐలు లోకేష్ కుమార్, శ్రీరామ్, జ్యోతి సిబ్బంది లక్ష్మీ ప్రసాద్, సూర్య ప్రసాద్, ప్రశాంత్ కుమార్, రమేష్, దాసు నాయుడు, శ్రావణిలను జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, అభినందించి, ప్రశంసా పత్రాలతో పాటు రివార్డులు ప్రకటించారు.

# ముగ్గురు అంతర్జిల్లా స్మగ్లర్లు అరెస్ట్

- రూ.2 కోట్ల విలువైన 108 ఎర్రచందనం దుంగలు స్వాధీనం
- ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు విస్తరించిన స్మగ్లింగ్ నెట్వర్క్ వెలుగులోకి.




తిరుపతి జూన్ 25 మనం న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శేషాచలం రిజర్వ్ అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం హెడ్ ఎల్. సుబ్బరాయుడు, మార్గదర్శకత్వంలో,ఆర్ఎస్ఏఎస్టీఎఫ్ ఎస్పీ పి. శ్రీనివాస్, అదనపు ఎస్పీ జె. కులశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆపరేషన్లునిరంతరంనిర్వహించబడుతున్నాయి.ఎర్ర చందనం కేసుల్లో నిందితులుగా ఉండి పరారీలో తిరుగుతున్న అంతర్రాష్ట్ర స్మగ్లర్లను గుర్తించి చట్టం ముందు నిలబెట్టేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విస్తృత చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం టాస్క్ ఫోర్స్ సిబ్బంది అటవీ శాఖ అధికారులకు అందిన విశ్వసనీయ సమాచారంతో అనంతపురం జిల్లా నార్పల మండలం బొందలవాడ గ్రామ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ ఆపరేషన్లో అనంతపురం జిల్లాకు చెందిన నల్లాని నందకుమార్ (32), నల్లాని జయరామయ్య, బొట్టు రాఘవేంద్రలను అదుపులోకి తీసుకున్నారు.దర్యాప్తులో భాగంగా, పై నిందితులు ఒక ముఠాగా ఏర్పడి శేషాచలం అడవుల్లో ఎర్రచందనం చెట్లను అక్రమంగా నరికించి, వాటిని దుంగలుగా తయారు చేయించి, అధిక ధరలకు ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ప్రధాన స్మగ్లర్లకు విక్రయించేందుకు ప్రణాళిక రచించినట్లు వెల్లడైంది. ఈ క్రమంలో నార్పల మండలం పరిధిలోని బొందలవాడ నుండి బొమ్మలాటపల్లి గ్రామానికి వెళ్లే మట్టి రహదారి సమీపంలో జయరామయ్యకు చెందిన పొలంలోని రేకుల షెడ్ పక్కన ఎర్రచందనం దుంగలను డంప్ చేసి దాచిపెట్టినట్లు గుర్తించారు.టాస్క్ ఫోర్స్ బృందం నిర్వహించిన దాడిలో మొత్తం 109 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడంతో పాటు, అక్రమ రవాణాకు వినియోగించిన ఒక కారును కూడా సీజ్ చేసింది. శేషాచలం అడవుల్లో ఎర్రచందనం అక్రమ నరికివేత, నిల్వ, రవాణా మరియు స్మగ్లింగ్ కార్యకలాపాలపై భవిష్యత్తులో కూడా మరింత కఠిన చర్యలు కొనసాగుతాయని, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు నిర్దాక్షిణ్యంగా అమలు చేయబడతాయని అధికారులు స్పష్టం చేశారు.

# శ్రీనివాసమంగాపురం ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు
- ఏఎస్ఐ అనుమతులతో అభివృద్ధి పనులు చేపడతాం
- టీటీడీ జేఈవో డాక్టర్ ఏ. శరత్



చంద్రగిరి, జూన్ 25 మనం న్యూస్: పంరాణ ప్రసిద్ధి గాంచిన శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు టీటీడీ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఈ మేరకు టీటీడీ జేఈవో డ్యాక్టర్ ఏ. శరత్ గురువారం ఆలయాన్ని సందర్శించి భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) అధికారులతో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, భారత పురావస్తు శాఖ ఆధీనంలోని ఈ ప్రాచీన ఆలయంలో చేపట్టే ప్రతి అభివృద్ధి పనికి ఏఎస్ఐ అనుమతి తప్పనిసరి అని తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చేపట్టగల అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించి, పురావస్తు శాఖ సూచనల మేరకు ప్రతిపాదనలు సమర్పించి అనుమతులు పొందనున్నట్లు వెల్లడించారు. భక్తుల సౌకర్యాలే లక్ష్యం తాగునీటి సౌకర్యాల మెరుగుదల, క్యూ లైన్ల అభివృద్ధి, మెట్ల మరమ్మతులు, యాగశాల నిర్మాణం అనంతరం పోటు నిర్మాణం వంటి పలు అభివృద్ధి పనులను గుర్తించినట్లు తెలిపారు. భక్తుల రాకపోకలకు మరింత సౌలభ్యం కల్పించేలా క్యూ లైన్లను సమతలీకరించి ఒకే విధమైన ఆకృతిలో తీర్చిదిద్దేందుకు ఏఎస్ఐ అధికారులు సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. అదేవిధంగా కళ్యాణమండపం, ఆలయ ప్రాంగణంలోని ఇతర సౌకర్యాల అభివృద్ధికి సంబంధించి సమగ్ర నివేదిక సిద్ధం చేసి పురావస్తు శాఖతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనుమతులు రాగానే వేగంగా పనులుఅభివృద్ధి పనులకు అవసరమైన అనుమతులు లభించిన వెంటనే వాటిని వేగంగా పూర్తి చేసి భక్తులకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని జేఈవో తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఈ. మనోహరం, సీపీఆర్వో డా. పి. రవి, అడిషనల్ హెల్త్ ఆఫీసర్ డా. సునీల్, ఏఈవో గోపినాథ్, ఇతర అధికారులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాజేశ్వరరావును పరామర్శించిన గుత్తుల సాయి

కాట్రేనికోన జూన్ 25 మనం ప్రతినిధి: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం కాట్రేనికోన మండలం కాట్రేనికోనలో కాట్రేనికోన మండలం వాటర్ డిస్ట్రిబ్యూషన్ కమిటీ ఉపాధ్యక్షులు వాసంశెట్టి రాజేశ్వరరావు మాతృమూర్తి ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి గురువారం పరామర్శించారు ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి బిసి సెల్ అధికార ప్రతినిధి విత్తనాల వెంకటరమణ ,గుత్తుల బుజ్జి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలి

- కలెక్టర్ చదలవాడ నాగరాణి



నరసాపురం, జూన్ 25 (మనం న్యూస్) : వ్యవసాయం మరియు ఉద్యానవన పంటలు సాగుచేసే ప్రతి రైతుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సంబంధిత సేవలు సకాలంలో అందించేందుకు ప్రభుత్వం చర్యలు అన్ని చేపట్టిందని రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సిహెచ్ నాగరాణి తెలిపారు. మొగల్తూరు మండలం రామన్నపాలెం గ్రామంలో గురువారం నిర్వహించిన రైతన్నా - మీకోసం రైతు అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ సిహెచ్ నాగరాణి, రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు పాల్గొని రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, వ్యవసాయాభివృద్ధి పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగ కలెక్టర్ మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం వల్ల ఆరోగ్యపరమైన, మార్కెటింగ్ పరమైన సమస్యలు తలెత్తుతున్నాయని ఇటీవల అధిక రసాయన అవశేషాల కారణంగా కొన్ని వ్యవసాయ ఉత్పత్తులు తిరస్కరణకు గురయ్యాయని రైతులు ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ సాగు విధానాల వైపు మళ్లాలని సూచించారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకని అన్నారు. రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలు, ట్రాక్టర్లు, ఆధునిక సాంకేతికత, సబ్సిడీ పథకాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొస్తోందని రైతుల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల ప్రయోజనాలు క్షేత్రస్థాయికి చేరుతున్నాయా లేదా అనే విషయాన్ని అధికారులు నిరంతరం పరిశీలిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, వ్యవసాయ ప్రోత్సాహక పథకాలు, సాగునీటి సదుపాయాలు, ఉద్యానవన అభివృద్ధి కార్యక్రమాలను రైతులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెదేపా ఇంచార్జ్ పొత్తూరి రామరాజు, మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకిరామ్, ఏఎంసి చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, వ్యవసాయ, అటవీ, ఉద్యానవన శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తూర్పుతాళ్లులో రెవెన్యూ గ్రామసభ

నరసాపురం, జూన్ 25 (మనం న్యూస్) : రైతులు తమ యొక్క భూములకు సంబంధించిన రికార్డులలో తప్పులు ఉన్నట్లయితే ఆర్జీల ద్వారా తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిశీలించి తప్పులను సరి చేయడం జరుగుతుందని నరసాపురం తాసిల్దార్ ఇ. నాగార్జున రైతులకు హామీ ఇచ్చారు. నరసాపురం మండలం తూర్పుతాళ్ళు రెవెన్యూ గ్రామానికి సంబంధించి రీసర్వే 13 నోటిఫికేషన్ లో భాగంగా తాసిల్దార్ నాగార్జున అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో రైతుల సమక్షంలో ముసాయిదా భూమి దస్త్రాలను చదివి వినిపించారు. రైతులు అడిగిన పలు సందేహాలకు తాసిల్దార్ వివరణ ఇచ్చారు. ఈ సభలో మాజీ సర్పంచ్ కడలి పద్మారావు, మాజీ ఉపసర్పంచ్ పులపర్తి నాగరాజు, ఎంపీటీసీ బళ్ళ హనుమంతు, మండల సర్వేయర్ ధనరాజు, వీఆర్వో బాలాజీ, విలేజ్ సర్వేయర్లు, రైతులు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు



# అక్రమాలను సక్రమం చేసే పనిలో అధికారులు



కుక్కునూరు,జూన్ 25( మనం న్యూస్ ) మండలంలో తొండిపాక గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భారీ అక్రమాలు చోటుచేసుకున్న విషయం విధితమే.గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో చెరువు పూడిక తీత పనులు పని చేయకుండానే కూలీల హాజరు నమోదు చేసి రూ. 25 లక్షలు అక్రమంగా దోచేసిన విషయం బాహాటంగానే తెలిసిందే.కాగా నిబంధనలకు విరుద్ధంగా మస్టర్ రోల్స్ నిర్వహించి ప్రభుత్వ నిధులను స్వాహా చేసిన అక్రమాల తో చేతులు కలిపిన అధికారులు అక్రమా న్ని సక్రమం చేసే పనిలో పడ్డారని తెలుస్తుంది. గత నెల 25వ తారీకు ఉపాధి హామీ పనుల్లో జరిగిన అక్రమాలపై స్థానిక అధికారులు విచారణ జరిపిన నేటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోవడం పట్ల అధికారుల పాత్ర పై అనువాలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికే 25 లక్షలో స్థానిక ఓ మండల స్థాయి అధికారి నుండి కింది స్థాయి ఉపాధి హామీ సిబ్బంది వరకు కూడా వాటాలు వెళ్లాయి అన్న ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి.. పనులు చేసిన కూలీలకు పూర్తి స్థాయిలో ఉపాధి కల్పించకుండా కూలీల ఫోటోలు అప్లోడ్ చేసి వారి వద్ద నుండి సగం వేతనాన్ని కాజేసిన ఉపాధి సిబ్బంది పై కనీస చర్యలు చేపట్టకపోవడం సర్వత్ర చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపేందుకు ఇటీవలే వచ్చిన ఓ ఉన్నతాధికారి సాయంత్రం మూడు గంటల సమయంలో గ్రామానికి వెళ్లి గ్రామస్తులు ఎవరూ లేరని వెనుతిరిగి వెళ్లడం మరల విచారణపై ఎటువంటి పురోగతి కలిగి కనిపించకపోవడం బట్టి చూస్తే వదంతులు నిజమేనన్న వాదనలు బలపడుతున్నాయి. ఉపాధి హామీలో ఈ వ్యవహారం నుండి మండల స్థాయి అధికారిని తప్పించే క్రమంలోనే ఉన్నతాధికారులు కూడా తమ వంతు సహకారం అందిస్తున్నారని స్థానికంగా గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఉపాధి హామీ లక్ష్యాన్ని నీరుగారిచే పనిని ఆ సిబ్బంది భుజాన వేసుకోవడం బట్టి చూస్తే మండల వ్యాప్తంగా ఉపాధి హామీలు ఎంత మేర అవినీతి కూరుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దీనిపై ప్రత్యేక అధికారి నియమించి ప్రతి పంచాయతీలో విచారణ చేయిస్తే అసలు పూర్తి అవినీతి బయటికి వచ్చే అవకాశం ఉంటుందని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## సంకల్పం మంచిదైతే..!

ఉత్తుత్తి మాటల కోటలు బీటలు వారి
ఒక పునాది చీలికలైపోయే దిశలో వుంది
వాగ్దానపు తుఫాను అలల ప్రేరణలో
ఒక నమ్మకం చిట్లిపోయింది
ఎన్ని రంగుల్ని అద్ది మెరిపించినా
ఒక తతంగం తుత్తునీయమైంది
అసంపూర్ణ సంకల్ప దీక్ష విరమణతో
ఒక నిర్మాణ ప్రాకారం ఆగిపోయింది
ఎన్ని వలయాలతో బంధించి మెప్పించినా
నిజం నిప్పై ఎగసిపడుతుంటే
అబద్ధం మౌనం మీదేసుకుని కూర్చుంది
మట్టిని జల్లే పన్నాగాలెన్ని పన్నినా
కొండ మీద వ్యాఘ్రహం వెనక్కి తగ్గకుంది
సంకల్పం మంచిదైనప్పుడు
నిప్పు కూడా జ్యోతిలా మారిపోతుంది
ఆచరణలేమితో నిరాధార అసంబద్ధ ప్రేళాపణతో
ఎంతటి సంకల్పమైనా చీలికలౌతుంది
సంక్షేమంతో వేసే ప్రతి పాదం గుర్తు
ఒక చరిత్రకు పునాదిరాయిలా నిలుస్తుంది
చూపుడు వేలు ధిక్కారం
ఒక వ్యవస్థను దిగ్బంధంలోకి నెట్టుతుంది
సంకల్పం మంచిదైతే
ఎన్ని అడ్డంకులు అడ్డుపడి నిందించినా
గమ్యం చేరాల్సిన చోటుకు చేరుతుంది

**- నరెద్దుల రాజారెడ్డి**
9666016636

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@ gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**

**ఈ పేపర్ కోసం**
**https://www.manamepaper.com/**
**వెబ్‌సైట్‌లో చూడండి - ఎడిటర్**

# మత్తును చిత్తు చేద్దాం.. భవితను నిర్మిద్దాం



నేటి వేగవంతమైన సామాజిక మార్పుల మధ్య పిల్లల భద్రతకు కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. వాటిలో అత్యంత ప్రమాదకరమైనది మత్తు పదార్థాల ముప్పు. ఒకప్పుడు పెద్దల సమస్యగా భావించిన డ్రగ్ దుర్వినియోగం, ఇప్పుడు చిన్న వయస్సుల వరకు చొరబడుతుండటం ఆందోళన కలిగించే అంశం. దేశ భవిష్యత్తు అనబడే యువతరం మత్తులో మునిగిపోతే, అది సమాజ అభివృద్ధికి పెద్ద అడ్డంకిగా మారుతుంది. భారత స్వాతంత్రోద్యమం ఆ తర్వాత జరిగిన యుద్ధాలలో భారతదేశ రక్షణకు ఉక్కు కవచంగా నిలిచిన పంజాబ్ యువత డ్రగ్స్ మహమ్మారితో పూర్తిగా నిర్వీర్యమైనది. అలాంటి పరిస్థితి తెలంగాణకు రాకుండా ఉండాలంటే అందరం అప్రమత్తం అవ్వాలి. తెలంగాణ అంటే ఒక ఐటీ, ఫార్మా హబ్. ఈ రాష్ట్రం గంజాయికి అడ్డాగా మారితే మనం విఫలమైనట్లే. అందుకే మనమంతా అప్రమత్తమై పోలీసింగ్ చేసినప్పుడే వాటిని నియంత్రించగలం. విద్యార్థులు, యువత నో డ్రగ్స్‌కు వారధులుగా మారి 1908 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారాన్ని అందించ గలిగితే నషాముక్తు తెలంగాణకు బాటలు వేయవచ్చు.

ప్రతిరోజు దేశంలో కోట్ల రూపాయల విలువైన డ్రగ్స్ పట్టుబడుతున్నాయి. ప్రపంచ స్థాయిలో డ్రగ్ వినియోగదారుల సంఖ్య సుమారు 316 మిలియన్లు ఉన్నట్లు తాజా నివేదికలు సూచిస్తున్నాయి. భారత్‌లో సుమారు 10 కోట్ల మంది మత్తు పదార్థాల ప్రభావంలో ఉన్నట్లు అంచనాలు ఉన్నాయి. ఈ గణాంకాలు కేవలం సంఖ్యలు కాదు సమాజానికి వినిపిస్తున్న హెచ్చరిక గంటలు. ఆసక్తి, స్నేహితుల ఒత్తిడి, సోషల్ మీడియా ప్రభావం, పార్టీ సంస్కృతి వంటి కారణాలతో పిల్లలు, కౌమార దశ విద్యార్థులు మత్తు వైపు ఆకర్షితులయ్యే ప్రమాదం పెరుగుతోంది. తోటి వారి ఒత్తిడి కారణంగా కొందరు మొదట ప్రయోగంగా మొదలుపెట్టి, తరువాత వ్యసనానికి లోనవుతున్నారు. ఆసక్తి పేరుతో అలవాటుగా మారడం భవిష్యత్తుకు ముప్పుగా మారుతుంది.



ప్రస్తుతం వినియోగంలో ఉన్న డ్రగ్స్‌లో గంజాయి, ఓపియం వంటి సహజ డ్రగ్స్, ఎల్ఎస్‌డీ, మెథాంఫెటమైన్, ఎమ్‌డీఎమ్ఏ వంటి సింథటిక్ డ్రగ్స్, నిద్ర మాత్రలు, పెయిన్ కిల్లర్స్ వంటి మెడిసిన్ దుర్వినియోగం, గ్లూ, థిన్నర్ వంటి ఇన్హేలెంట్స్, కొకైన్ వంటి స్టిమ్యులెంట్స్, ఆల్కహాల్ వంటి డిప్రెసెంట్స్ ఉన్నాయి. ఇవి తాత్కాలిక ఆనందం ఇచ్చినా, దీర్ఘకాలంలో తీవ్ర నష్టాలను కలిగిస్తాయి. దేశంలో డ్రగ్ నియంత్రణలో Narcotics Control Bureau (NCB), NCRB, NCOR–, హోంశాఖ వంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇవి అంతర్రాష్ట్ర సమన్వయంతో డ్రగ్ మాఫియాపై కఠిన చర్యలు తీసుకుంటున్నాయి.

తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరోను ఈగల్ గా మార్చిన నేపథ్యంలో EAGLE (Elite Action Group for drug Law Enforcement) డ్రగ్ నియంత్రణలో కీలకంగా మారింది. ఈ బృందం పెద్ద డ్రగ్ రాకెట్లను ఛేదించడం, ఆర్థిక వనరులను ఫ్రీజ్ చేయడం, సైబర్ నిఘా ద్వారా నెట్‌వర్క్‌లను గుర్తించడం వంటి చర్యలు చేపడుతోంది. పాఠశాలలు, కాలేజీలలో ఏర్పాటు చేస్తున్న ప్రహరీ క్లబ్బులు విద్యార్థుల్లో అవగాహన పెంచుతూ, మత్తు దూరం చేసే దిశగా పని చేస్తున్నాయి. పోస్టర్ ప్రదర్శనలు, ర్యాలీలు, అవగాహన కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో చైతన్యం కలగజేస్తున్నాయి. దేశంలోనే తొలిసారిగా కృత్రిమ మేధా పరిజ్ఞానంతో కూడిన 3 టూల్స్‌ను ఈగల్ ఫోర్స్ రూపొందించింది. వాటిలో ఒకటి సహాయ్ ఏఐ ఇది మాదకద్రవ్యాలకు సంబంధించిన సందేహాలనునివృత్తి చేస్తుంది. షీల్ ఏఐ ఇది మార్గద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి చెబుతుంది. మిత్ర-టీజీ దీని ద్వారా మాదకద్రవ్యాల వ్యసనాలకు అలవాటు పడిన పిల్లల యొక్క వ్యవహార శైలిని విశ్లేషించేందుకు అవసరమైన సమాచారాన్ని అందిస్తుంది.

తెలంగాణ ప్రభుత్వం డ్రగ్ నియంత్రణలో కఠిన చర్యలతో పాటు రిహాబిలిటేషన్, కౌన్సెలింగ్ కార్యక్రమాలను కూడా చేపడుతోంది. టెక్నాలజీ ఆధారిత నిఘా, పోలీస్ దాడులు, విద్యాసంస్థలలో అవగాహన కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతున్నాయి. డ్రగ్ ఫ్రీ తెలంగాణ లక్ష్యం సాధించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి. ఉపాధ్యాయులు విలువల విద్యతో పాటు డ్రగ్స్ ప్రమాదాలపై అవగాహన కల్పించాలి. యువత Say No to drugs తో పాటు Yes to Sports సందేశాన్ని తమ సహచరుల్లో విస్తరించాలి. డ్రగ్ నియంత్రణలో అవగాహన అత్యంత ముఖ్యమైన ఆయుధం. చట్టం భయం ఒక్కటే సరిపోదు. చైతన్యం, సంభాషణ, సహకారం అవసరం. పిల్లలను మత్తు ముప్పు నుండి కాపాడటం అంటే దేశ భవిష్యత్తును కాపాడినట్టే. పిల్లల భద్రత కోసం ప్రతి ఇంటి నుంచి, ప్రతి పాఠశాల నుంచి, ప్రతి సమాజం నుంచి ఒకే స్వరం వినిపించాలి - డ్రగ్స్‌కు నో, జీవితానికి యెస్. పిల్లల్లో విలువలు, విజన్, విజ్ఞానం పెంచితే మత్తుకు చోటుండదు. అందుకే Say No to drugs ఒక నినాదం మాత్రమే కాదు. పిల్లల రక్షణకు సమాజం మొత్తం స్వీకరించాల్సిన బాధ్యత.

**అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం**

**- డా. చల్లా ప్రభాకర్ రెడ్డి**
9059734830

# తిరుమల క్షేత్రంలో జ్యేష్ఠాభిషేకం

తిరుమల క్షేత్రంలో సంవత్సరం పొడవునా జరిగే అనేక ఆధ్యాత్మిక ఉత్సవాలలో 'జ్యేష్ఠాభిషేక మహోత్సవానికి' అత్యంత విశిష్టమైన, అగ్రశ్రేణి స్థానం ఉంది. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వరుని ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి నిర్వహించే ఈ మహోత్సవం కేవలం వైఖానస ఆగమ సంప్రదాయ పరిరక్షణకే కాకుండా, వైష్ణవ ఆరాధనా విధానంలో దైవమూర్తుల సంరక్షణకు సంబంధించిన అత్యంత ప్రాచీనమైన, వైజ్ఞానిక ప్రాతిపదిక గల ఆధ్యాత్మిక ప్రక్రియగా భావించబడుతుంది. గణాంకాల ప్రకారం తిరుమలలో ఏడాది పొడవునా దాదాపు 470కి పైగా ఉత్సవాలు, విశేష సేవలు, నిత్య, వార, పక్ష, మాస వైభవోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. వీటిలో అత్యధిక భాగం ఉత్సవమూర్తి అయిన శ్రీ మలయప్ప స్వామివారికే జరగడంవిశేషం. ఈ నేపథ్యంలో, ప్రతిరోజూ జరిగే వివిధ రకాల అలంకరణలు, కవచాల ధారణ, వాటిని తొలగించడం, నిత్య అభిషేకాలు, ఊరేగింపుల సమయాల్లో పంచలోహ నిర్మిత విగ్రహాలకు స్వల్ప స్థాయిలో అరుగుదల సంభవించే అవకాశం ఉంటుంది. ఈ అరుగుదల నుండి, ప్రాచీన దివ్య మూర్తుల రూపురేఖలు చెడిపోకుండా సుదీర్ఘకాలం పాటు సంరక్షించేందుకు వైఖానస ఆగమ సంప్రదాయంలో మహర్షులు సూచించిన పరమ పవిత్రమైన, శాస్త్రీయమైన ప్రత్యేక విధానమే ఈ జ్యేష్ఠాభిషేకం.

ఈ ఉత్సవానికి గల పూర్వాపరాలను, చారిత్రక ప్రాశస్త్యాన్ని పరిశీలిస్తే, భృగు మహర్షి ప్రతిపాదించిన 'క్రియాధికార' అనే ప్రాచీన వైష్ణవ ఆగమ గ్రంథాలలో ఉత్సవమూర్తుల అంగాలు, మహాంగాలు, ఉపాంగాలు మరియు ప్రత్యాంగాలను పరిరక్షించాల్సిన ఆవశ్యకతను అత్యంత వివరంగా పేర్కొన్నారు. శాస్త్ర విశ్లేషణ ప్రకారం విగ్రహాల నేత్రాలు, నాసిక, శ్రవణాలు (చెవులు) వంటి భాగాలను అంగాలుగా, శిరస్సు, కంఠం, వక్షస్థలం, బాహువులు (చేతులు) వంటి భాగాలను మహాంగాలుగా, కేశాలు, నఖాలు (గోళ్లు) వంటి సూక్ష్మ రూపాలను ఉపాంగాలుగా, అలాగే స్వామివారి చేతుల్లోని శంఖం, చక్రం, శిరస్సుపై శోభిల్లే మకుటం, పాద పీఠం వంటివాటిని ప్రత్యాంగాలుగా విభజించారు. ఇవి కాలక్రమంలో పర్యావరణ ప్రభావాల వల్ల గానీ, నిరంతర పూజాదికాల వల్ల గానీ దెబ్బతినకుండా సంరక్షించేందుకు వీలుగా సుగంధ పరిమళ తైలాలు, పవిత్ర నదీ జలాలు, ఔషధ గుణాలు గల పంచామృతాలతో ప్రత్యేక సంస్కార అభిషేకాలు నిర్వహించాలని ఆగమ శాస్త్రాలు నిర్దేశించాయి. ఈ విశేష గుణం కారణంగానే జ్యేష్ఠాభిషేకానికి అభిదేయక అభిషేకం అని లేదా సుగంధ తైల సమర్పణోత్సవం అని నామాంతరాలు ఏర్పడ్డాయి. 'అభిదేయక' అనగా మూల రూపానికి రక్షణ కల్పించేది అని అర్థం. చంద్రుడు జ్యేష్ఠా నక్షత్ర పరిధిలోకి వచ్చే సమయంలో విశ్వవ్యాప్త శక్తి ప్రసరణ అధికంగా ఉంటుందని, ఆ సమయంలో శ్రీమహావిష్ణువు రూపానికి విశేష అభిషేకం, చందన లేపనం, సుగంధ ద్రవ్య సమర్పణ చేయడం వల్ల ఆ ఉత్సవ విగ్రహాల దివ్య తేజస్సు నూతన ఉత్తేజాన్ని పొంది మరింత వృద్ధి చెందుతుందని భృగు మహర్షి పేర్కొన్నట్లు వైష్ణవ సంప్రదాయ సిద్ధాంతాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ దివ్య ఆదేశాన్ని అనుసరించి తిరుమల ఆనంద నిలయంలో ఈ మహోత్సవం శతాబ్దాల కాలంగా ఎలాంటి విఘ్నాలు లేకుండా ఏకధాటిగా కొనసాగుతూ వస్తోంది.

మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగే ఈ జ్యేష్ఠాభిషేక మహోత్సవంలో మొదటి రోజు కార్యక్రమాలు అత్యంత ప్రధానమైనవి. ఆలయంలో ప్రాతఃకాలంలో యథావిధిగా సుప్రభాత సేవ, తోమాలసేవ, సహస్రనామార్చన, ప్రథమ నైవేద్యం, ద్వితీయ అర్చన వంటి నిత్య కైంకర్యాలన్నీ ఏకాంతంగా, శాస్త్రోక్తంగా పూర్తిచేసిన అనంతరం, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారిని ఆనందనిలయ గర్భాలయం నుండి బంగారు తిరుచ్చిపై



అధిష్టింపజేసి, సంపంగి ప్రదక్షిణంలోని చారిత్రాత్మక కల్యాణ మండపానికి వేడుకగా తీసుకువస్తారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో అర్చకులు శాంతిహోమం, నవకలశ ప్రతిష్ఠ, శతకలశ ప్రతిష్ఠలను వైభవంగా నిర్వహిస్తారు. వివిధ పవిత్ర నదుల నుండి సేకరించిన జలాలను ఈ కలశాలలో నింపి, వాటికి ప్రత్యేక పూజలు, ఆవాహనాది క్రతువులు పూర్తి చేస్తారు. అనంతరం స్వామివారికి, అమ్మవార్లకు రక్షాబంధనం లేదా కంకణధారణ కార్యక్రమాన్ని, హోమ ప్రక్రియలను ముగించి, స్వామివారికి రక్షా సూచికగా హోమతిలకాన్ని నుదుట ధరింపజేస్తారు. ఆపై పరమ పవిత్రమైన ఆవు పాలు, గడ్డ పెరుగు, స్వచ్ఛమైన తేనె, లేత కొబ్బరినీరు, పసుపునీరు, గంధపు పొడి, సుగంధ ద్రవ్యాల మిశ్రమాలతో కూడిన పంచామృతాలతో 'స్నపన తిరుమంజనం' నిర్వహిస్తారు. శతకలశాలలో మంత్రపూతంగా ఆవాహన చేసిన పవిత్ర జలాలతో విశ్వరూప అభిషేకం చేయడం.. అభిషేకం ముగిసిన అనంతరం దేవతామూర్తుల శరీర రక్షణార్థం ప్రత్యేక చందన లేపనాన్ని చేసి, ఆపై స్వామి అమ్మవార్లను పట్టువస్త్రాలు, దివ్యాభరణాలతో శోభాయమానంగా అలంకరిస్తారు.

జ్యేష్ఠాభిషేక మహోత్సవాలకు గల మరో ప్రధాన వైవిధ్యం ఏమిటంటే, సాధారణంగా ఉత్సవమూర్తులైన మలయప్ప స్వామివార్లకు సంవత్సరంలో మిగిలిన రోజుల్లో కేవలం శిరస్సు పైనుండి మాత్రమే శుద్ధజలాలతో అభిషేకం నిర్వహిస్తారు, ఎందుకంటే కవచం లోపల ఉన్న విగ్రహానికి తడి తగలకుండా రక్షించాల్సి ఉంటుంది. అయితే ఈ మూడు రోజులలో మాత్రం కవచాలు లేనందున, అంగాంగ రక్షణ కోసం పంచామృతాలు, సుగంధద్రవ్యాలు, పాలు, పెరుగు, తేనె, చందనం, సుగంధ తైలాలు, వనమూలికల పవిత్ర తీర్థజలాలతో పాదాదిమస్తకం సమగ్రంగా, సంపూర్ణంగా అభిషేకం జరుగుతుంది.

సనాతన ధర్మ భక్తుల దృష్టిలో తిరుమల జ్యేష్ఠాభిషేకం అనేది కేవలం చూసి వెళ్లే ఒక సాధారణ వార్షిక ఉత్సవం మాత్రమే కాదు; అది జన్మజన్మల పాపాలను పోగొట్టి, దైవానుగ్రహాన్ని నేరుగా పొందే ఒక అరుదైన దివ్య ఆధ్యాత్మిక అవకాశం. వేదపండితుల మంత్రోచ్చారణలు, వేదఘోషల మధ్య జరిగే అభిషేకాలు, నవరత్న కవచాల అలంకార వైభవం, ఉత్సవమూర్తుల అరుదైన నిజరూప సౌందర్య దర్శనం, సాయంత్రం వేళల్లో సర్వాంగ సుందరంగా అలంకరించిన తిరుచ్చిపై చతుర్వేద పారాయణాల నడుమ, మంగళవాయిద్యాలు మారుమోగుతుండగా పురవీధుల్లో జరిగే దివ్య ఊరేగింపులు భక్తులలో అపారమైన భక్తిభావనను, మానసిక ప్రశాంతతను కలిగిస్తాయి.

అందుకే ప్రతి సంవత్సరం ఈ మహోత్సవ విశేషాలను ప్రత్యక్షంగా వీక్షించి తరించాలనే తపనతో దేశ విదేశాల నుండి వేలాదిమంది భక్తులు తిరుమల గిరులకు తరలివస్తుంటారు. ఈ ఏడాది జూన్ 26 నుంచి 28వ తేదీ వరకు మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్న ఈ జ్యేష్ఠాభిషేక మహోత్సవాల సందర్భంగా తిరుమలకు వచ్చే సామాన్య భక్తుల రద్దీని, వారికి కల్పించాల్సిన సౌకర్యాలను ముందస్తుగా దృష్టిలో ఉంచుకొని, తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) పాలకమండలి కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంది.

ఇందులో భాగంగా ఉత్సవం జరిగే రోజుల్లో, ముఖ్యంగా జూన్ 28న ఆలయంలో నిత్యం జరిగే ఆర్జిత సేవలైన పవిత్ర కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకరణ సేవ వంటి సేవలను పూర్తిగా రద్దు చేసింది. భక్తులకు కవచాల మార్పిడి దర్శనాన్ని త్వరితగతిన కల్పించేందుకు, మహోత్సవాల నిర్వహణకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ ఈ ఆర్జిత సేవలను తాత్కాలికంగా నిలిపివేయడం జరిగింది. దైవమూర్తుల సుదీర్ఘ కాల సంరక్షణ, ప్రాచీన ఆగమ సంప్రదాయాల యథాతథ పరిరక్షణ మరియు భక్తుల ఉత్కృష్ట ఆధ్యాత్మిక అనుభూతి అనే మూడు మహత్తర లక్ష్యాలను ఏకకాలంలో అద్భుతంగా సాధించే ఈ తిరుమల జ్యేష్ఠాభిషేక మహోత్సవాలు శ్రీవారి అపరిమిత వైభవానికి నిలువెత్తు ప్రతీకగా, వైష్ణవ ఆరాధనా సంప్రదాయానికి కాలం చెదరని చిరస్మరణీయ సాంస్కృతిక వారసత్వంగా నేటికీ నిలిచిపోయాయి.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# త్యాగానికి ప్రతీక మొహర్రం

హిందువులు, ముస్లిం సోదరులూ సమిష్టిగా జరుపుకునే మొహర్రం ప్రత్యేకత సంతరించుకుంది. త్యాగానికి, మహోన్నత సనాతన సాంప్రదాయానికి, మత సామరస్యానికి ప్రతీక మొహర్రం వేడుక. ధర్మసంస్థాపన లక్ష్యంగా, నమ్మిన సిద్ధాంతాల కోసం పలువురు ప్రాణాలర్పించిన మాసం మొహర్రం. ధర్మ సంస్థాపనార్థం హజ్రత్ ఇమామ్ హుస్సేన్, హసన్ లు తమ ప్రాణాలను అర్పించి 14 వందల సంవత్సరాలు గడిచినా అమరవీరుల త్యాగాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో స్మరిస్తూ, అమరుల త్యాగశీలతకు జోహార్లను అర్పించడం సత్సాంప్రదాయంగా



ఆచరిస్తున్నారు. మొహర్రం మాసమంటే ధర్మా, దర్మాలకు జరిగిన సంఘర్షణ ఫలితంగా ముస్లింలు భావిస్తారు. ఇస్లాం మత స్థాపకుడు ప్రవక్త మహమ్మద్ పరమపదించిన అనంతరం సమ సమాజ స్థాపన కోసం ప్రజా స్వామ్య పద్ధతిలో, సౌదీ అరేబియాలో తమ ప్రతి నిధిని ఎన్నుకునే కార్యక్రమాన్ని చేపట్టారు. తదను గుణంగా మదీనా రాజధానిగా గల రాజ్యానికి హజ్రత్ అబూబకర్ తొలి ఖలీఫాగా ఎన్నుకొనగా, అనంతరం హజ్రత్ ఉమర్, హజ్రత్ ఉస్మాన్ హజ్రత్ అలీలను ఖలీఫాగా ఎన్నుకున్నారు.

వీరి పరిపాలన సమయంలో న్యాయం, ధర్మం నాలుగు పాదాలపై నడిచాయని చెపుతారు. ధార్మిక, సామా జిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో సమానత్వం వెల్లి విరిసిందంటారు. ఐదవ ఖలీఫాగా ప్రజలు ఇమాం హుస్సేన్ తమ ప్రతినిధిగా ఎన్నుకోగా, సిరియా ప్రాంతానికి గవర్నరుగా ఉన్న హజ్రత్ మివాయా అధికార దాహంతో ఖలీఫా పదవిని ఆశించి పోటీ పడగా, ఇరువర్గాల మధ్య యుద్ధానికి నాంది పలి కింది. యుద్ధ పరిణా మాలను గ్రహించిన హుస్సేన్, రక్తపాత నివారణకై రణరంగం నుండి నిష్క్రమించి, ప్రజలు తమకు విశ్వాసంతో కట్టబెట్టిన అధికారాన్ని త్యాగం చేశారు. తెలుగు ప్రాంతాల్లో, మరీ ముఖ్యంగా నిజాం పాలిత ప్రాంతాల్లో మొహర్రం పండుగను ముస్లిములే కాక అన్ని వర్గాల ప్రజలూ జరుపుకోవడం వందలాది ఏళ్ళుగా సాగుతోంది. యాత్రా చరిత్ర కారుడు ఏనుగుల వీరాస్వామయ్య జూన్ 29, 1830న నిజాం పాలిత ప్రాంతాల్లో ప్రారంభమైన మొహర్రం పండుగను తాను రచించిన కాశీయాత్ర చరిత్రలో అభివర్ణించారు. మొహర్రం నెల పదవ రోజు యౌమీ ఆషూరా. ముహమ్మద్ ప్రవక్త మనుమడైన హుసేన్ ఇబ్న్ అలీ, కర్బలా యుద్ధంలో అమరుడైన రోజు. ముహర్రం నెలను, 'షహీద్ ' (అమర వీరుల ) నెలగా వర్ణిస్తూ, పండుగలా కాకుండా, వర్ధంతిలా జరుపుకుంటారు. షియా ఇస్లాంలో ఈ ముహర్రం నెల, 'ఆషూరా', కర్బలా యుద్ధంలో మరణించిన వారి జ్ఞాపకార్థం, శోక దినాలుగా గడుపుతారు. షియాలు మాతమ్ (శోక ప్రకటన) జరుపుతారు. తెలంగాణలో పలుచోట్ల ఈ ముహర్రం పండుగను పీర్ల పండుగ అనే పేరుతో జరుపు కుంటారు. వారం రోజుల పాటు హిందూ, ముస్లిం సోదరులు కలిసి కట్టుగా పీర్లను పిల్లను నెలకొల్పి, చివరి రోజు వేలాదిమంది తోడురాగా వెళ్ళి పరి సమాప్తి గావిస్తారు.

పీర్ల పండుగ సందర్భంగా సంతాన హీనులైన హిందూ స్త్రీలు మొక్కులు చెల్లించు కోవడం, పులుల ఇతర వేషాలతో విన్యాసాలు చేస్తూ, ఆడుతూ వారం డబ్బులు ప్రోగుచేసు కోవడం క్షేత్రం ఏటా అనుసరింప బడుతున్న సాంప్రదాయంగా మారింది. హైదరాబాద్ పాతబస్తీలో షియా ముస్లింలు తమను తాము హింసించు కుంటూ విషాదం వ్యక్తం చేస్తూ వూరేగింపులో పాల్గొంటారు. బీబీకా అలావా నుంచి ప్రారంభమై ఈ వూరేగింపు అలీజా కోట్ల, చార్మినార్, గుల్జార్ హౌస్, మీరాలం మండీ, దారుల్ షిఫాల మీదుగా కొనసాగి చాదర్ ఘాట్ వద్ద ముగుస్తుంది. శిక్షణ ఇచ్చిన ఏనుగుపై ఈ ఊరేగింపు సాగుతుంది.

**- ఆర్‌కేఎస్**
9440595494

# విద్యావ్యవస్థను బలోపేతం చేయాలి



ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను పెంచి నాణ్యమైన విద్యను అందించినప్పుడే ప్రైవేట్ పాఠశాలలను కట్టడి చేయడానికి వీలు పడుతుంది. మన దేశంలో విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించినప్పటికీ, నాణ్యమైన విద్య అందరికీ సమానంగా అందడం ఇప్పటికీ ఒక సవాలుగానే ఉంది. ముఖ్యంగా పట్టణాలు, చిన్న పట్టణాలు, మండల కేంద్రాల్లో విద్యారంగంలో అసమతుల్యత స్పష్టంగా కనిపిస్తోంది. అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య చాలా తక్కువగా ఉండగా, ప్రైవేట్ పాఠశాలలు మాత్రం పదుల సంఖ్యలో ఏర్పడుతున్నాయి. విద్యను సేవా రంగంగా కాకుండా వ్యాపారంగా మార్చే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల అనుమతుల విధానాన్ని పునఃపరిశీలించడం, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం అత్యవసరంగా మారింది. ఈ పరిస్థితికి ప్రభుత్వాలు జవాబుదారిగా ఉండాలి. ప్రైవేటు విద్యను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విద్యానిపుణుల సలహాలను తీసుకొని ప్రైవేటు విద్యను నియంత్రించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వాలు గమనిస్తున్నట్లు లేదు.

నేడు ఒక చిన్న పట్టణంలో పట్టుమని పది ప్రభుత్వ పాఠశాలలు కూడా కనిపించవు. కానీ అదే ప్రాంతంలో ఇరవై, ముప్పై లేదా అంతకంటే ఎక్కువ ప్రైవేట్ పాఠశాలలు నిర్వహణలో ఉంటాయి. విద్యార్థుల సంఖ్యకు మించి పాఠశాలలు ఉండటం వల్ల పరస్పర పోటీ పెరిగి, విద్య కంటే వ్యాపార ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తల్లిదండ్రులపై అధిక ఫీజుల భారం పడుతోంది. పుస్తకాలు, యూనిఫాంలు, రవాణా, ఇతర రుసుముల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలకు అనుమతులు మంజూరు చేసే విధానంలో జనాభా ప్రాతిపదికన సరైన ప్రణాళిక కనిపించడం లేదు. ఒక ప్రాంతంలో ఇప్పటికే సరిపడా పాఠశాలలు ఉన్నప్పటికీ కొత్త పాఠశాలలకు అనుమతులు ఇస్తున్నారు. ఫలితంగా విద్యా ప్రమాణాల కంటే వ్యాపార ప్రయోజనాలు ముందుకు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జనాభా నిష్పత్తిని ఆధారంగా తీసుకుని పాఠశాలల అనుమతుల కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వం జనాభాను దృష్టిలో పెట్టుకుని కొత్త ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేయాలి. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కొత్త పాఠశాల భవనాలు నిర్మించాలి. ప్రతి



పాఠశాలలో విశాలమైన తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, క్రీడా మైదానాలు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలి. నాణ్యమైన భవనాలు, ఆధునిక సదుపాయాలు ఉన్నప్పుడే విద్యార్థులు ప్రభుత్వ బడులపై ఆసక్తి చూపుతారు. ఉపాధ్యాయుల నియామకాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. సాంకేతిక పరిజ్ఞానం ఆధారిత బోధనను ప్రోత్సహించాలి. డిజిటల్ తరగతులు, స్మార్ట్ బోర్డులు, కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలి. ఉపాధ్యాయులకు తరచూ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి బోధన ప్రమాణాలను మెరుగుపరచాలి.

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే ఉన్నతాధికారులు,శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులుగా ఎదిగారు. ఆ స్థాయిని తిరిగి తీసుకురావడం అసాధ్యం కాదు. సరైన ప్రణాళిక, రాజకీయ సంకల్పం ఉంటే ప్రభుత్వ విద్యను తిరిగి ప్రజల మొదటి ఎంపికగా మార్చవచ్చు.ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను పెంచి, మౌలిక వసతులు కల్పించి, నాణ్యమైన విద్యాబోధన జరిగేలా చర్యలు చేపట్టాలి. పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు ఉత్తమ విద్య అందేలా ప్రభుత్వం బాధ్యత వహించాలి. అప్పుడే ప్రభుత్వ బడులపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. ప్రభుత్వ విద్య బలోపేతం అయిన ప్పుడే సమాన విద్యావకాశాలు అందరికీ లభిస్తాయి. అదే నిజమైన సామాజిక న్యాయం, అదే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది.

**- బూర్గుపల్లి కృష్ణ యాదవ్**
9866170384

# మాసాంతర రివ్యూ.. పోలీస్ స్టేషన్ పనితీరుపై సిపి పర్యవేక్షణ



విశాఖపట్నం జోన్ 25 మనం న్యూస్ : నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి, నగర కాన్ఫరెన్స్ హాల్ నందు పోలీసు ఉన్నతాధికారులతో కలిసి ఏడీసీపీలు నుండి ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన ఈ నెల రివ్యూ మీటింగ్ లో ప్రతి ఒక్క పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ల పనితీరును పరిశీలించారు.ట్రాఫిక్, క్రైమ్, లా అండ్ ఆర్డర్ లకు నిర్వహించిన ఈ నెల రివ్యూ మీటింగ్ నందు ఆయా విభాగాల పనితీరును సీపీ గారు పూర్తిగా సమీక్షించారు.నగరంలో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో యాక్టీవ్ గా ఉన్న రౌడీ షీటర్లు,వారిపై పెడుతున్న నిఘా చర్యలను ఆరా తీశారు, నిన్నటి వరకూ నమోదు చేసిన ఎన్ డి పి ఎస్ కేసు వివరాలను సమీక్షించి, నగరం గుండా ఏటువంటి ఎన్ డి పి ఎస్ రవాణా జరగకుండా పూర్తిగా నిరోధించాలని తెలిపారు.నగరంలో పోలీస్ స్టేషన్లో లాంగ్ పెండింగ్ లో ఉన్న కేసులు యొక్క వివరాలు, కేసు పెండింగ్ ఉండడానికి గల కారణాలు తెలుసుకొని సదరు పెండింగ్లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించివలసిందిగా ఆదేశించారు, కోర్టు తీర్పు వెలువరించిన కేసుల వివరాలు తెలుసుకున్నారు. ప్రతీ స్టేషన్ పరిధిలో యెటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా పూర్తిగా నివారించాలని, ఆయా స్టేషన్ పరిధిలో గల నిర్మానుష్యప్రాంతాలను, సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలిస్తూ విజిబుల్ పోలీసింగ్, పికేట్, అవసరం మేరకు డికొయ్ టీంలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు పూర్తి అదుపులో ఉండాలనీ, గంజాయి ఎక్కడా ఉండరాదని, ఈవ్ టీజింగ్, ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్ వంటి ఏ స్టేషన్ పరిధిలోనూ చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని, అందుకు అదనంగా వెహికల్, మెన్ ఇతర అవసరాలు ఏమైనా ఉన్నచో తనకు తెలియజేయాలని తెలిపారు. నగరంలో అన్ని పోలీస్ స్టేషన్ల లో కేసులు నమోదు చేస్తున్న తీరు, అధికారులు ఫిర్యాదుదారులతో ప్రవర్తిస్తున్న తీరు పై ఆరా తీసి, తగు ఆదేశాలు జారీ చేశారు. పోక్సో కేసుల పైన ఆరా తీశారు, నగరంలో క్రైమ్ రేటు తగ్గు ముఖం పట్టేలా రాత్రి పూట నిఘా మరింత పటిష్టం చేయాలనీ తెలిపారు.విజిటర్స్ మానిటరింగ్ సిస్టమ్ ను పూర్తిగా లా ఆర్డర్ మరియు క్రైమ్ సిబ్బంది అందరూ వినియోగిస్తూ నిందితులను మరింత వేగముగా గుర్తించాలని తెలిపారు.సైబర్ క్రైమ్ పై మరింత బలోపేతం చేసే చర్యలపై చర్చించారు, ప్రజలకు పూర్తి అవగాహన అయ్యేలా మరిన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు, పలు కొత్త సాఫ్ట్ వేర్ లను తీసుకొని వినియోగించాలని సూచించారు.ఉమెన్ సేఫ్టీ కు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, మహిళల పైన వేదింపులు, మహిళ మిస్సింగ్ సంబంధిత కేసులలో జాప్యం లేకుండా తక్షణమే స్పందించి ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంలో వారితో వ్యవహరించాలన్నారు,పోక్సో కేసుల పైన ఆరా తీశారు.కోర్టు నందు కేసులు ఎటువంటి జాప్యం లేకుండా, కన్విక్షన్ పడే కేసులు సంఖ్య పెరిగే విధముగా చేయుటకు, అధికారులు మరియు సిబ్బంది సందేహాలను నివృత్తి చేసేందుకు లోక్ ఆధాలత్ నందు గతంలో కంటే మరిన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ఆహ్వానించి పలు న్యాయ సంబంధిత అంశాలపై పరస్పరం చర్చించి, పోలీసు అధికారులు పలు న్యాయ సంబంధిత అంశాలలో తమ సందేహాలను పబ్లిక్ ప్రాసిక్యూటర్లను ను అడిగి నివృత్తి చేసుకున్నారు.వచ్చే నెల నిర్వహించబోవు రివ్యూ మీటింగ్ నందు ప్రతి పోలీస్ స్టేషన్ గత నెల కంటే మెరుగ్గా, క్రైమ్ తగ్గు ముఖం పట్టే విధముగా పోలీసింగ్ ఉండాలని తెలిపారు.నగర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పూర్తి పారదర్శకముగా తమ విధులు నిర్వర్తించాలని, విధులలో ఎటువంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, అధికార దుర్వినియోగానికి పాల్పడినా, అవినీతికి పాల్పడినా తక్షణమే వారిపై కఠిన చర్యలు ఉంటాయనీ తెలిపారు.ఈ సమావేశంలో డి.సి.పి-01(ఎల్ ఓ) వి.ఎన్. మణికంఠ చందోలు, , డి.సి.పి(క్రైమ్స్) లతా మాధురి, డి.సి.పి(అడ్మిన్) సి.హెచ్ పాపా రావు , నగర ఏ.డి.సి.పి లు, ఏ.సి.పి లు, స్టేషన్ ఎస్.హెచ్.ఓ లు, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# 244 మంది పోలీసులకు రివార్డులు




- పోలీసు కమీషనర్

విశాఖపట్నం జూన్ 25 మనం న్యూస్: నగర పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి, క్రైమ్ రివ్యూ సమావేశంలో గత నెలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బంది సేవలను ప్రోత్సహిస్తూ 244 మందికి రివార్డ్ మంజూరు ఆర్డరును అందజేశారు.నగర పోలీసు శాఖ నందు హోంగార్డు నుండి సిఐ స్థాయి అధికారుల వరకూ వారు నిర్వహిస్తున్న విధులకు తగ్గా గుర్తింపు ఇస్తూ, ప్రతి నెలా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి తగు రివార్డులు అందజేసి, వారు సమర్ధవంతముగా విధులు నిర్వహిస్తూ తోటి సిబ్బందికి ప్రేరణ ఇస్తూ అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరం మరింత సురక్షితముగా ఉండే దిశగా సిపి చర్యలు తీసుకున్న విషయం విధితమే.గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తూ నగరం గుండా రవాణా అవుతున్న గంజాయిని సీజ్ చేసిన పలు కేసులలో, చోరీ కాబడిన సొత్తు,ఇతర వస్తువులను రికవరీ చేసి, నిందితులను అరెస్టు చేసిన పలు కేసులలో, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి పేరుమోసిన నేరస్తులను అరెస్టు చేయడంలో ముఖ్యపాత్ర పోషించిన కేసులో, సైబర్ క్రైమ్ కేసులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 244 మంది, హోం గార్డు నుండి సి.ఐ వరకూ గల సిబ్బందికి రివార్డులు మంజూరు చేసి, సిబ్బంది అందరూ ప్రేరణ చెంది మరింత మెరుగ్గా విధులు నిర్వర్తించేలా ఈ రోజు క్రైమ్ మీటింగ్ కు నందు నగర పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో రివార్డు మంజూరు ఆర్డరును అందజేశారు.

# రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు రావాడ సీతారాం పర్యటన

- జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎం. అన్నపూర్ణమ్మ

విజయనగరం, జూన్ 26: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్ కులాల కమిషన్ సభ్యులు రావాడ సీతారాం ఈ నెల 27వ తేదీ (శుక్రవారం) విజయనగరం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎం. అన్నపూర్ణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటన సందర్భంగా జిల్లాలోని వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు తమ సమస్యలు, వినతులు, ఫిర్యాదులను కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకురావచ్చని ఆమె తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు నిర్ణీత సమయానికి హాజరై అవసరమైన నివేదికలు, వివరాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. పర్యటన వివరాలు: ఉదయం 10.00 గంటలకు గంట్యాడ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుంటారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు గంట్యాడ తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు గంట్యాడ మండలంలో భూసంబంధిత ఫిర్యాదులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో పర్యటిస్తారు. సాయంత్రం 5.00 గంటల నుంచి 6.00 గంటల వరకు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ మరియు సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి, అక్కడి వసతులను పరిశీలిస్తారని ఆమె వివరించారు.

# నరసింహ సదన్ సత్రంలో భక్తుల సౌకర్యాలపై ఆకస్మిక తనిఖీ



సింహాచలం, జూన్ 25 : శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం సింహాచలం ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు గురువారం దేవస్థానం ఇంచార్జి పర్యవేక్షణాధికారి మూలవాసు తో కలిసి నరసింహ సదన్ సత్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నరసింహ సదన్లో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కియోస్క్ మిషన్ల పనితీరును పరిశీలించారు. భక్తులు వాటిని సక్రమంగా వినియోగిస్తున్నారా, మిషన్ల ద్వారా అందుతున్న సేవలపై ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే విషయాలను భక్తులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. భక్తులకు మరింత సులభంగా, వేగవంతంగా సేవలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం భక్తులకు కేటాయిస్తున్న గదులను పరిశీలించి, వాటి నిర్వహణ, పరిశుభ్రత, మౌలిక సదుపాయాల స్థితిగతులను తనిఖీ చేశారు. గదులలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు చేపట్టిన చర్యలను పర్యవేక్షణాధికారి మూలవాసు కార్యనిర్వహణాధికారికి వివరించారు.జ ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు మాట్లాడుతూ, సింహాచలం విచ్చేసే భక్తులకు ఉత్తమ వసతి సౌకర్యాలు అందించడం దేవస్థానం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నరసింహ సదన్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశుభ్రత, సేవల నాణ్యత, సౌకర్యాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు దేవస్థానం నిరంతరం చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు పరిహారం పంపిణీ

విశాఖపట్నం జూన్ 25 మనం న్యూస్: రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా హిట్ అండ్ రన్ కేసులో గాయపడిన 8 మందికి 50, వేల రూపాయలు చొప్పున 4,00,000/- పరిహారం గురువారం అందజేశారు.విశాఖపట్నం సిటీ పోలీస్ కమీషనర్ వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా, బాధితులకు, పరిహారం అందే వరకు, కావలసిన, సహాయం అందజేయడం జరుగుతున్నది. ఈ సహాయక కేంద్రం తీసు కున్న చర్యల ఫలితంగా, విశాఖపట్నం సిటీ పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో హిట్ అండ్ రన్ కేసులో యాక్సిడెంట్ లో గాయపడిన బమ్మిడి. పద్మ, బిల్లల వలస, మెరక మొడిదాం. మండలం, విజయనగరం జిల్లా, అను ఆమెకు 50,000/- రూపాయలు, విశాఖపట్నం సిటీ పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో హిట్ అండ్ రన్ కేసులో గాయపడిన బొంతల కోటి .రవితేజ . దుర్గా నగర్, హెచ్ బి కాలనీ, విశాఖపట్నం సిటీ, అని వారికి 50 వేల రూపాయలు,విశాఖపట్నం సిటీ, పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో , హిట్ అండ్ రన్ కేసులో గాయపడిన విశాఖపట్నం సిటీ మద్రిపాలెం, కి చెందిన హనుమంతు. సుజాత కి ,50 వేల రూపాయలు,విశాఖపట్నం సిటీ, పీఎం పాలెం ,పోలీస్ స్టేషన్ ,పరిధిలో జరిగిన హిట్ అండ్ కేసులో గాయపడిన శ్రీ గుర్ల.నూకరాజు 30 . గుమ్మడివానిపాలెం గ్రామం, ఆనందపురం మండలం ,విశాఖపట్నం సిటీ ,అను వారికి 50 వేల, రూపాయలు,విశాఖపట్నం సిటీ, ఎంవిపి పోలీస్ స్టేషన్, పరిధిలో జరిగిన ,హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసులో గాయపడిన బొడ్డేటి. పద్మ కొత్త వెంకోజీ పాలెం విశాఖపట్నం సిటీ , అను ఆమెకు,50 వేల రూపాయలు, విశాఖపట్నం సిటీ, ఆరిలోవ పోలీస్ స్టేషన్, పరిధిలో జరిగిన హిట్ అండ్ రన్ కేసులో గాయపడిన గుంట .రాధా 38. దుర్గాపురం , ఎన్ఏడి జంక్షన్. విశాఖపట్నం సిటీ , అను ఆమెకు 50 వేల రూపాయలు,విశాఖపట్నం సిటీ, పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో, హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసులో గాయపడిన చుక్క .హరికృష్ణ గణేశ్ నగర్, సబ్బవరం మండలం, అనకాపల్లి జిల్లా, అను వారికి 50 వేల రూపాయలు, విశాఖపట్నం సిటీ, పెందుర్తి పోలీస్ స్టేషన్, పరిధిలో హిట్ అండ్ కేసులో గాయపడిన, జామి.సన్నిబాబు, దుర్గా నగర్, పెందుర్తి మండలం, విశాఖపట్నం సిటీ,అను వారికి, 50,000/-- (యాభై వేల రూపాయలు) మొత్తం ఎనిమిది మందికి, 50వేల రూపాయలు చొప్పున 4,00000/- (నాలుగు లక్షల రూపాయలు ) వారి యొక్క బ్యాంకు ఖాతాకు, నేరుగా నగదు మ చేయిూచడం జరిగిందన్నారు. ఇంతవరకు విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన ఇట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసుల్లో ఇప్పటివరకు 28 మంది మృతుల కుటుంబాలకు, 56,00,000/- ( యాభై ఆరు లక్షల, రూపాయలు, ) గాయపడిన 130 మందికి 65,00,000/- (అరవై ఐదు లక్షల, రూపాయలు,) మొత్తం 158 మంది బాధితులకు రూ.1,21,00,000/- (అక్షరాల ఒక కోటి, ఇరవై ఒక లక్షల రూపాయలు)పరిహారం అందజేయడం జరిగింది. ఈ కేసుల్లో , పరిహారం కోసం, దరఖాస్తు చేయదలచిన బాధితులు, ఎవరైనా సహాయం కొరకు, విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ ఆఫీస్, గ్రౌండ్ ఫ్లోర్ లో ఏర్పాటు చేసిన 'రోడ్డు ప్రమాద బాధితుల సహాయ కేంద్రం,' నందు గాని , లేదా టోల్ ఫ్రీ నెంబర్ 7995095793 కి గాని సంప్రదించగలరు.

# మల్టీ లెవెల్ కార్ పార్కింగ్‌ను వాహనదారులు వినియోగించుకోవాలి

- రోడ్లపై అస్తవ్యస్తంగా పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవు
- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



విశాఖపట్నం, జూన్ 25: విశాఖ నగర పరిధిలో రోడ్లపై వాహనాలను అస్తవ్యస్తంగా పార్కింగ్ చేసి ప్రజలకు, వాహనాల రాకపోకలకు, ట్రాఫిక్ నియంత్రణకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ హెచ్చరించారు. గురువారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జీవీఎంసీ సౌత్ జోన్ పరిధిలోని 29వ వార్డు జగదాంబ జంక్షన్ వద్ద ఉన్న మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ (ఎంఎల్సీపీ)ను పరిశీలించారు. పార్కింగ్ నిర్వహణ, వాహనాల రాకపోకలు, వినియోగదారుల వివరాలను సంబంధిత కార్ పార్కింగ్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విశాఖ నగరంలో వాహనాల రద్దీని తగ్గించడం, ప్రజలకు సౌకర్యవంతమైన పార్కింగ్ సదుపాయం కల్పించడం లక్ష్యంగా స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ ద్వారా నిధులు వెచ్చించి అధునాతన సదుపాయాలతో మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాహనదారులు, వ్యాపార సంస్థలు తమ వాహనాలను రోడ్లపై ఇష్టానుసారంగా పార్కింగ్ చేయకుండా అందుబాటులో ఉన్న మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రోడ్లపై అస్తవ్యస్తమైన పార్కింగ్ కారణంగా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడటమే కాకుండా పాదచారులు, రాకపోకలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పారిశుద్ధ్య పనులకు ఆటంకం కలుగుతుందని అన్నారు. ఇకపై సీసీ కెమెరాల ద్వారా రోడ్లపై అక్రమంగా, అసౌకర్యంగా పార్కింగ్ చేసే వాహనాలను గుర్తించి సంబంధిత వారికి జరిమానాలు విధిస్తూ తగిన చర్యలు పోలీసువారి సహకారంతో తీసుకోవడం జరుగుతుందన్నారు. మల్టీ లెవెల్ కార్ పార్కింగ్లో ప్రతిరోజు ఎన్ని వాహనాలు పార్కింగ్ అవుతున్నాయి, ఏ ప్రాంతాల నుంచి వాహనదారులు వినియోగిస్తున్నారనే వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఎం ఎల్ సి పి పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాల నిఘాతో అస్తవ్యస్తంగా పార్కింగ్ చేసిన వాహనాలను గమనించి ,ఎం ఎల్ సి పి సదుపాయాన్ని వినియోగించేలా వాహనదారులకు సూచిస్తూ అవగాహన కల్పించాలని నిర్వాహకులకు కమిషనర్ ఆదేశించారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత



నరసాపురం, జూన్ 25 (మనం న్యూస్) : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తెలిపారు. నరసాపురం మండలం సీతారామపురం సౌత్ గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామ సభలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ ప్రజల నుండి వివిధ సమస్యలు, అభివృద్ధి పనులకు సంబంధించిన అర్జీలు, వినతులను స్వీకరించి వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు గ్రామ సభలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా గ్రామాల అభివృద్ధికి మరింత సమర్థవంతంగా పనిచేయగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, నియోజవర్గ ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 48 మంది దివ్యాంగులకు మోటరైజ్డ్ 'నియో బోల్ట్' వీల్ చైర్ల పంపిణీ



- జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

పుట్టపర్తి, జూన్ 25 మనం న్యూస్: దివ్యాంగుల స్వావలంబనను పెంపొందించేందుకు అత్యాధునిక సాంకేతికతతో రూపొందించిన 48 మోటరైజ్డ్ 'నియో బోల్ట్' బ్యాటరీ వీల్ చైర్లను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ గురువారం పంపిణీ చేశారు. స్థానిక రెవెన్యూ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో టింబక్టు కలెక్టివ్ సహకారంతో, హ్యుందాయ్ మోబిస్ ఆర్థిక సహాయంతో నియోమోషన్ సంస్థ ఈ వీల్ చైర్లను అందించింది.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, సాధారణ వీల్ చైర్గా ఉపయోగించుకోవడంతో పాటు అవసరమైనప్పుడు స్కూటీగా మార్చుకునే సౌకర్యం కలిగిన ఈ పరికరాలు దివ్యాంగుల ప్రయాణాన్ని సులభతరం చేస్తాయని తెలిపారు. స్వయం ఆధారిత జీవితానికి ఇవి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు.

సామాజిక బాధ్యతలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన హ్యుందాయ్ మోబిస్, టింబక్టు కలెక్టివ్, నియోమోషన్ సంస్థలను ఆయన అభినందించారు. ఎంపిక శిబిరానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 100 మంది దివ్యాంగులు హాజరయ్యారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ అర్చన, నియోమోషన్ సహ వ్యవస్థాపకులు సిద్ధార్థ్, హ్యుందాయ్ మోబిస్ ప్రతినిధి సింధుజ, టింబక్టు కలెక్టివ్ ప్రోగ్రామ్ మేనేజర్లు శ్రీకాంత్, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్రపతి విశాఖ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్




విశాఖపట్నం, జూన్ 25: భారత రాష్ట్రపతి ఈ నెల 30వ తేదీన విశాఖపట్నంలో పర్యటించనున్న నేపథ్యంలో అన్ని శాఖలు అత్యంత అప్రమత్తతతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా నిర్వహించనున్న సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం, యూనివర్సిటీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, రాష్ట్రపతి కార్యాలయం నిర్దేశించిన ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. కార్యక్రమ వేదిక, భద్రతా ఏర్పాట్లు, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, తాగునీటి సదుపాయాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవ కార్యక్రమం విశాఖపట్నంలోని వీ-కన్వెన్షన్, నోవోటెల్లో జరగనున్న నేపథ్యంలో వేదిక వద్ద అన్ని మౌలిక సదుపాయాలను ముందస్తుగా సిద్ధం చేయాలని సూచించారు. రాష్ట్రపతి కార్యాలయం ఆమోదించిన కార్యక్రమ షెడ్యూల్కు అనుగుణంగా ప్రతి ఏర్పాటును సమయపాలనతో పూర్తి చేయాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైద్య బృందాలు, అంబులెన్సులు, ఫైర్ సర్వీసెస్ సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. పర్యటనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రపతి భవన్ అధికారులు, జిల్లా యంత్రాంగం మధ్య సమన్వయం కోసం జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరిని నోడల్ అధికారిగా నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు సంబంధించి వివిధ శాఖలకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సంబంధిత అన్ని శాఖల అధికారులు సంపూర్ణ బాధ్యతతో పనిచేసి, అప్పగించిన పనులను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాథుర్, ట్రైబల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ మిశ్రా, ఇతర ఆచార్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# కుంతీ లక్ష్మీ నరసింహస్వామి వారి వార్షిక కళ్యాణ మహోత్సవం

పాలకొల్లు,జూన్ 25,మనం ప్రతి నిధి : పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం కొంతేరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ కుంతీ లక్ష్మీ నరసింహస్వామి వారి వార్షిక కళ్యాణం సందర్భంగా గురువారం మధ్యాహ్నం శ్రీ అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం నుండి అంతర్వేది దేవస్థానం సూపరింటెంట్ విజయ సారథి, అర్చకులు గోవర్ధన లక్ష్మి నరసింహ రాజేష్ మరియు జూనియర్ అసిస్టెంట్ పి.రాంబాబు పట్టు వస్త్రములు శ్రీ స్వామి వారికి కొంతేరు దేవస్థానం తరపున జూనియర్ అసిస్టెంట్ నల్లం రామకృష్ణ, తాత్కాలిక అర్చకులు పూలపల్లి వేణునాథ్ కు అందించడం జరిగినది. ఈకార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు ఘన స్వాగతం పలికి పట్టు వస్త్రములను ఊరేగింపుగా దేవస్థానమునకు తీసుకువచ్చారు.



# వర్షపాతం తక్కువ నమోదు అవుతుంది రైతులు అప్రమత్తంగా ఉండాలి




- వరి పరిశోధన అధికారి సహదేవ రెడ్డి

ఆచంట జూన్ 25 మనం న్యూస్: ప్రస్తుత సార్వా ఖరీఫ్ సీజన్లో ఎల్ ని నో ప్రభావం వల్ల లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పంట పొలాలకు నీటి ఎద్దడి తలెత్తకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని మార్టేరు ఏడిఆర్ వరి పరిశోధన స్థానం ఇన్చార్జ్ డాక్టర్ సహదేవరెడ్డి అన్నారు గురువారం ఆచంట మండల పరిధిలోని కొడమంచిలి మరియు ఏ వేమవరం గ్రామాల్లో కేత్ బచావో అభియాన్.. భూసారాన్ని పరిరక్షించండి అనే అంశంపై గ్రామ సభలు నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సహదేవ రెడ్డి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఏ ఖరీఫ్ సీజన్లోనైనా వరి కోతలు పూర్తయిన అనంతరం వరి మూడులకు నిప్పు పెట్టకుండా ఎకరాకు 100 కిలోల సూపర్ పాస్ పెట్ ఎరువును ఉపయోగించి కలియ దున్నుకోవడం ద్వారా భూమికి సేంద్రియ ఎరువు లభ్యమవుతుందని వివరించారు స్థానిక మండల వ్యవసాయ అధికారి నాగరాజు మాట్లాడుతూ రైతులంతా సార్వాసాగుకు సమాయత్తమై ఈనెల 20వ తేదీ లోపు తప్పనిసరిగా నారుమడులు పూర్తి చేసుకోవాలని తెలిపారు రైతులు తప్పకుండా విత్తన శుద్ధి చేసుకోవాలని పలు సూచనలు చేశారు మరో అతిథి పాలకొల్లు సహాయ వ్యవసాయ సంచాలకులు మురళీకృష్ణ మాట్లాడుతూ రసాయన ఎరువులు వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడకం పెంచాలని తద్వారా భూసారం మెరుగుపడి అధిక దిగుబడులు సాధించవచ్చు అని అన్నారు సార్వ దాల్వా పంటలు పూర్తయిన అనంతరం వేసవి పంటగా అపరాలు లేదా పచ్చిరొట్ట పైర్లు వేసుకుని నేలలో తెలియదు ఉండడం వల్ల సేంద్రియ కార్బన్ శాతం భూమిలో పెరుగుతుందని వివరించారు ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా మాత్రమే రైతులకు యూరియా మరి డిఎపి ఎరువులు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు ఏ రకం పంట సాగు చేసిన తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని లేనియెడల పండించిన ధాన్యాన్ని విక్రయించుకోవడానికి గాని లేదా ఎరువుల విషయంలో కానీ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అందువల్ల తప్పకుండా ప్రతి రైతు సేవా కేంద్రంలో పంట నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి ప్రభుత్వ నాయకులు రైతులు వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# వైద్య విద్యలో వికసించిన వైద్య పుష్పాలు(అక్కా చెల్లెళ్ళు )







**అమలాపురం జూన్ 25 మనం న్యూస్**

సముద్ర తీర ప్రాంతం, అందమైన మడ అడవులు, గోదావరి పాయలు, చుట్టూ నీరు తో ఉన్న పల్లం గ్రామంలో అక్కా చెల్లెళ్ళు డా.కె సింధుజ, డా.కె సాత్వీక వైద్యపుష్పాలు వికసించాయి. ఈగ్రామంలో అందరూ అగ్నికుల క్షత్రియ సామాజక వర్గానికి చెందిన వారే ఉంటారు. డా.బిఆర్ అంబేడ్కర్ కోససీమ జిల్లా కాట్రేనికోన మండలంలో వర్గ పోరుతో అట్టుడికి పోయే అత్యంత సమష్యాత్మక గ్రామాలలో పల్లం గ్రామం ఒకటి. పల్లం గ్రామంలో అక్షరాస్యత అంతంత మాత్రంగానే ఉండటంతో పాటు నేటికీ పెత్తందారీ వ్యవస్థ కొనసాగుతుంది. నిరక్షరాస్యత, పెత్తందారీ వ్యవస్థతో పాటు వర్గపోరుతో అట్టుడికి పోయే పల్లం గ్రామంలోని యువత అక్షరాస్యత వైపు అడుగులు పడుతున్నాయి. యువతీ, యువలు ఉన్నత చదువులు వైపు అడుగులు వేస్తున్నారు. సుమారు పదివేల మంది జనాభా ఉన్న పల్లం గ్రామంలో వైద్య విద్యను పూర్తి చేసిన మొట్ట మొదటి వైద్యులు, మహిళా వైద్యురాలు కర్రి సింధుజ. ఈ ఏడాది ఆమె చెల్లులు కర్రి సాత్వీక అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో వైద్య విద్యను పూర్తి చేసి డీన్ డా. ఆనందాచారి, డా. వర్ధనల చేతులు మీదుగా పట్టాను అందుకుంది. కుటుంబ నేపథ్యం కాట్రేనికోన మండలం పల్లం గ్రామంలో అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గంనకు చెందిన వైద్యులు కె సింధుజ, సాత్వికల తాతయ్య, నాయనమ్మలు కర్రి నాగరాజు, సత్యవతిలు పిఎంపీ వైద్యులు, పూర్వీకులు నుంచి వచ్చిన ఆయుర్వేద వైద్యం అందించేవారు. ఆయన పిఎంపి వైద్యులు కావడంతో ఇంటింటికి వెళ్ళి రోగులకు వైద్య సేవలు అందించేవారు. గ్రామంలో అక్షరాస్యత లేక పోవడం, వర్గపోరుతో దాడులు, పెత్తందారీ వ్యవస్థతో జరుగు తున్న అనర్థాలు పిల్లలుపై పడకూడదనే తపనతో తన నలుగురు కుమారులను విద్యావంతులుగా దీర్చి దిద్దారు. డా. సింధుజ, డా. సాత్వికల తల్లి. దండ్రులు కెజిబివిఎస్ రాజు, వాణీ శ్రీ దంపతులు ఇద్దరు ఉన్నత చదువులు చదువు కోవడం, వృత్తి రీత్యా ఉపాధ్యాయులు కావడంతో ఆడపిల్లలని అధైర్య పడలేదు. అక్కాచెల్లెళ్ళులను ఉన్నత చదువులు చదివించి వైద్యులుగా తీర్చి దిద్దారు. విద్యాభ్యాసం : పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు చెందిన వనమాడి సువర్ణవేణి అమ్మమ్మ ఇంటివద్ద ఉంటూ విద్యాభ్యాసం చేసారు. డా. సింధూజ, డా. కె సాత్వికలు 1వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు సెయింట్ మేరీ పాఠశాలలోను, సింధూజ ఇంటరు విజయవాడ శ్రీచైతన్య విద్యాసంస్థలోను, శశి విద్యాసంస్థ తణుకు వేలివెన్నులో డా సాత్వీక ఇంటర్ మీడియట్ పూర్తి చేసారు. నీట్ ప్రవేశ పరీక్షలో ఇద్దరూ మెరిట్ కోటాపై అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ సీట్లును సాధించి వైద్య కళాశాలలో వైద్య విద్యను పూర్తి చేసారు. అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలో డా. కె సింధుజ 2024లో ఎంబిబిఎస్ పూర్తి చేయగా, కె సాత్విక ఈఏడాది ఎంబిబిఎస్ పూర్తి చేయడంతో కిమ్స్ కళాశాల డీన్ డా. ఆనందాచారి, డా. వర్ధన చేతులు మీదుగా చైర్మన్ వైద్య పట్టాను అందుకున్నారు.

**నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తా:**

గైనకాలజీలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసి నిరుపేద మహిళలకు వైద్య సేవలు అందిస్తాను.కార్పోరేటు విద్య, వైద్యం సామాన్యులకు అందని ద్రాక్షగా మారింది. బలహీన వర్గాలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాను.

**డా. కె సింధూజఅణగారిన వర్గాల అభివద్ధికి కృషి చేస్తాను:**

స్వాతంత్యం వచ్చి ఏళ్ళు గడిచినా నేటికీ పల్లెలలో కనీసం మౌళిక సదుపాయలు గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో అందడం లేదు. సివిల్స్ ర్యాంకు సాధించి అణగారిన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తాను.; డా.కె సాత్వీక

# ఘనంగా గ్రాడ్యుయేషన్ డే




**ముమ్మిడివరం జూన్ 25 మనం ప్రతినిధి :** నడవ పల్లి పల్లిపాలెం 2 అంగన్వాడి సెంటర్లో గాడ్యుయేషన్ డే మరియు అంగన్వాడీ పిలుస్తుంది అనే కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి సిడిపిఓ నిహారిక అధ్యక్షతన జరిగింది అంగన్వాడి సెంటర్లో ప్రీస్కూల్ పూర్తిచేసుకుని ఒకటో తరగతిలో జాయిన్ అయ్యే పిల్లలకు ప్రీస్కూల్ సర్టిఫికెట్ అందజేయడం జరిగింది సెక్టార్ సూపర్వైజర్ తులసి కుమారి అంగన్వాడి సెంటర్ లో పిల్లలను జాయిన్ చేయాలని అంగన్వాడి సెంటర్ లో వర్క్ బుక్స్ పిల్లలు ఆడుకునే మెటీరియల్ చూపించి పిల్లలకు పౌష్టికాహారము అందజేయడం జరుగుతుందని తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం జరిగింది ఈ కార్యక్రమానికి అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు

# పిఠాపురం పట్టణంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**పిఠాపురం జూన్25(మనం న్యూస్):**పిఠాపురం నియోజవర్గం శాసనసభ్యులుఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పిఠాపురం పట్టణం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పట్టణంలో 9 మందికి జనసేన పార్టీ పిఠాపురం పట్టణ ఇంచార్జి డా చిక్కాల వరలక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా ఇంచార్జ్ డా.చిక్కాల వరలక్ష్మి మాట్లాడుతూ 4వ వార్డు ఇంచార్జ్ బొచ్చుల శ్రీనివాస్ మరియు మేళం రామకృష్ణ ఆధ్వర్యంలో శెట్టిబలిజి పేటలో శ్రీనివాసరావు, కామేశ్వరి ఇద్దరికీ మరియు 11, 13, 14, 18, 21, 25వ వార్డ్ లో లబ్ధిదారుల కు అందించడం జరిగింది అని అన్నారు.అనారోగ్య రీత్యా హాస్పిటల్ లో అడ్మిట్ అయిన పేషంట్లకు ఆర్థిక స్తోమత సరిగా లేని వారికి ఈ సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో దోహదపడుతుందని దీని ద్వారా వారికి ఆర్థికంగా తోడ్పాటు కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కోపరేటివ్ బ్యాంక్ వైస్ చైర్మన్ మేళం రామకృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ లు కొత్తం రమేష్, తోట నాగిని, వివిధ వార్డ్ ఇంచార్జ్ లు వనం వీరబాబు, బొచ్చుల శ్రీనివాస్, కుక్కల నాగలక్ష్మి, పోలిశెట్టి చంద్రశేఖర్, బాలిపల్లి శివ సూర్య, పసుపులేటి గణేష్, ఆగంటి ప్రభాకర్,వేల్పుల చక్రధర్,చోడిశెట్టి భూరయ్య కాపు,గండి లోవరాజు, గంగాధర్, వార్డు బూతు ఇంచార్జ్ లు శ్రీనివాస్, కర్నీడి బాబురావు, వాసు, అంకం చక్రకుమార్, తలారి జ్యోతి , ఎలిశెట్టి భాను , సంతోష్, కసిరెడ్డి నాగేశ్వరరావు, పెదిరెడ్ల భీమేశ్వరరావు,4వ వార్డు బూత్ ఇంచార్జ్ లు రాజు,ఎన్.గణేష్,రాము, వీరమహిళలు జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ గ్రేడ్ పురోహితుడి వ్యవహారం మళ్లీ చర్చనీయాంశం

- క్రమశిక్షణ చర్యలు తొలగింపుకు పాలక మండలిపై ఒత్తిడి?



**అన్నవరం, జూన్ 25, మనం న్యూస్ :** అన్నవరం దేవస్థానం కొండపై వ్రత విభాగంలో స్పెషల్ గ్రేడ్ పురోహితుడిగా పనిచేసిన మల్లాది గురుమూర్తిపై గతంలో నమోదైన అభియోగాలు, ప్రస్తుతం ఆయనకు సంబంధించిన తాజా ఆరోపణలు మరోసారి దేవస్థాన వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. దేవస్థానం వ్రతాల విశిష్టతను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలనే ఉద్దేశంతో గతంలో అధికారులు వివిధ జిల్లాల్లో సామూహిక వ్రతాల కార్యక్రమాలను నిర్వహించారు. ఈ క్రమంలో పశ్చిమగోదావరి జిల్లాలో నిర్వహించిన ఓ సామూహిక వ్రత కార్యక్రమంలో పాల్గొన్న భక్తుల నుంచి దానధర్మాలు, వస్త్రదానం, గోదానం, భూదానం తదితర పేర్లతో భారీ మొత్తంలో నగదు వసూలు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన దేవస్థాన అధికారులు మల్లాది గురుమూర్తిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టి సస్పెండ్ చేశారు. అలాగే రెండు ఇంక్రిమెంట్లు కట్ చేసి వ్రత నిర్వహణలో వ్రతకథను చెప్పకుండా ఉండేలా సంబంధిత విభాగ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయితే, సస్పెన్షన్ అనంతరం కూడా ఆయన వ్యవహార శైలి వివాదాస్పదంగానే కొనసాగుతోందని దేవస్థాన వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇటీవల కొత్త పాలకవర్గం ఏర్పడిన నేపథ్యంలో కొందరు పాలకవర్గ సభ్యులను ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరిని మభ్యపెట్టడం, తనకు అనుకూలంగా పరిస్థితులు మలుచుకునేందుకు ప్రయత్నించడం, అవసరమైతే రాజకీయ నాయకుల పేర్లను ఉపయోగిస్తూ ఒత్తిడి తీసుకురావాలనే యత్నాలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా, మెట్ట ప్రాంతానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి పేరును అడ్డంగా పెట్టుకుని దేవస్థాన అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని చూస్తున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. దీంతో కొందరు అధికారులు సైతం అసౌకర్యానికి గురవుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. దేవస్థానం ప్రతిష్ఠకు భంగం కలిగించే అంశాలపై పాలకవర్గం, ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు. గతంలో నమోదైన ఆరోపణలు, ప్రస్తుతం వినిపిస్తున్న విమర్శలపై పూర్తి స్థాయి దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. క్రమశిక్షణ చర్యల తొలగింపునకు పాలకవర్గాన్ని ఆశ్రయిస్తున్న పురోహితుడు? అన్నవరం దేవస్థానంలో స్పెషల్ గ్రేడ్ పురోహితుడిగా పనిచేసి ప్రస్తుతం క్రమశిక్షణ చర్యలు ఎదుర్కొంటున్న మల్లాది గురుమూర్తి తనపై ఉన్న సస్పెన్షన్ ఎత్తివేసినప్పటికీ ఇతర చర్యలను తొలగించాలని కోరుతూ పాలకవర్గ సభ్యులను ఆశ్రయిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు పలువురు సభ్యులకు వినతిపత్రాలు సమర్పించినట్లు దేవస్థాన వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తనపై నమోదైన ఆరోపణలను పునఃసమీక్షించి న్యాయం చేయాలని కోరుతూ కొందరు పాలకవర్గ సభ్యులకు బంపర్ ఆఫర్ కూడా ప్రకటించినట్లు ప్రచారం జరుగుతుంది. అయితే గతంలో నమోదైన అభియోగాల తీవ్రత దృష్ట్యా ఈ వ్యవహారంపై పాలకవర్గం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశం ఆసక్తికరంగా మారింది. మరోవైపు దేవస్థానం ప్రతిష్ఠను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిబంధనల మేరకే నిర్ణయాలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ఈ అంశంపై పాలకవర్గం, ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించి తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# రోడ్లపై గుంతలు లేకుండా చర్యలు



**కాట్రేనికోన జూన్ 25 మనం ప్రతినిధి** కాట్రేనికోన మండలంలోని వివిధ శాఖలకు చెందిన రోడ్లపై గుంతలు లేకుండా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యకు సత్వర పరిష్కారం చూపుతామని కాట్రేనికోన ఎంపీడీవో బి రాజేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం నడవపల్లి రోడ్డులో గుంతలను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు, స్థానికులు ఎంపీడీవోకు తెలిపారు. ఆయా గుంతల్లో నిలిచిపోయిన నీటిని జేసీబీ సహాయంతో తరలించారు.నడవపల్లి రోడ్డు పంచాయతీ రాజ్ పరిధిలోకి వస్తుంది కనుక సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు చేపట్టేలా కార్యాచరణ చేపడతామని ఎంపీడీఓ తెలిపారు.

# యువతకు భవిష్యత్తు వృత్తిరీత్యా కోర్సుల ద్వారానే

- ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ...
- ఘనంగా నూతన విక్టరీ విజన్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రారంభోత్సవం..



**శంఖవరం జూన్ 25 మనం ప్రతినిధి:** పోటీ ప్రపంచంలో యువతకు భవిష్యత్తు వృత్తిరీత్యా కోర్సుల ద్వారానే లభిస్తుందని ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యురాలు వరుకుల సత్యప్రభ అన్నారు. శంఖవరం మండలం, కత్తిపూడి గ్రామంలో గుడాల రామకృష్ణ నూతనంగా ఏర్పాటు చేసిన విక్టరీ విజన్ ఒకేషనల్ జూనియర్ కళాశాల మరియు కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్, లైబ్రరీలను ప్రత్తిపాడు శాసన సభ్యురాలు వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. అనంతరం కళాశాల యాజమాన్యానికి పలు సూచనలు అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమెతోపాటు జనసేన పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబీ),రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ డైరెక్టర్ వెన్నా ఈశ్వరుడు, జగంపేట వైస్సార్సీపీ నాయకులు తోట రాంజీ ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ, తక్కువ కాలంలో చక్కని విద్య అభ్యసించి యువతకు మంచి భవిష్యత్తు ఉన్న కోర్సులు ఈ కాలేజీలో అందుబాటులోకి తీసుకురావడం, ఈ కోర్సుల చదువుతో త్వరగా ఉపాధి పొందాలి అనుకునేవారికి ఈ కళాశాల మంచి అవకాశం కల్పిస్తుందని యువత సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. మంచి నాణ్యమైన విద్యను అందించాలని, వృత్తిరీత్యా కోర్సుల కళాశాలకు మరియు యాజమాన్యానికి తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని వెన్నా ఈశ్వరుడు, అన్నారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ, యువత కళాశాలలో అందుబాటులో ఉన్న ఉపాధి కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ, జనసేన నేత మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబి) కూటమి నాయకులకు, వైయస్సార్సీపి నాయకులకు మర్యాదపూర్వకంగా పుష్పగుచ్చాలతో ఆహ్వానం పలికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ గుడాల రామకృష్ణ, మాజీ జడ్పీటీసీ సభ్యులు గుడాల మాధవి చార్వక, సెక్రటరీ గుడాల ఎస్ రాజ్ కిరణ్, డైరెక్టర్ గుడాల శ్రీనివాస్, ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు వజ్ర కోట మాజీ సర్పంచ్ కీర్తి వెంకట సుభాష్ అన్నవరం తెలుగుదేశం పార్టీ నాయకులు రాజాల చిట్టిబాబు పలివెల సతీష్, మాజీ ఎంపీటీసీ సభ్యులు, సాధనాల లక్ష్మీ బాబు, కంచి బోయిన శ్రీను, కేలంగి జన, అధ్యాపకులు మాసా శ్రీనుబాబు, దడాల బాలసుబ్రహ్మణ్యం, కళాశాల సిబ్బంది,కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యంత్రాలయం దర్శనం, ప్రత్యేక అభిషేక టికెట్ల ధరల పెంపుపై భక్తుల అసంతృప్తి



**అన్నవరం, జూన్ 25, మనం న్యూస్ :** అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో యంత్రాలయం దర్శనం టికెట్ ధరను రూ.50 నుంచి రూ.100కు పెంచే ప్రతిపాదనకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. ఇప్పటికే ఈ అంశంపై అధికారులు నిర్ణయం తీసుకుని దేవాదాయ శాఖ కమిషనర్కు ప్రతిపాదనలు పంపగా, తాజాగా బుధవారం జరిగిన పాలకవర్గ సమావేశంలో దీనికి అధికారిక ఆమోదం లభించింది. అయితే ఈ నిర్ణయంపై భక్తుల్లో మిశ్రమ స్పందనలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి దేవస్థానంలో కూడా సాధారణ దర్శనం టికెట్ రూ.50గానే కొనసాగుతుండగా, అన్నవరంలో అదనంగా రూ.50 పెంచడం సమంజసం కాదని పలువురు భక్తులు అభిప్రాయపడుతున్నారు. ఇదే సమయంలో స్వామివారి మఖా నక్షత్రం రోజున నిర్వహించే ప్రత్యేక అభిషేక సేవ టికెట్ ధరను రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు పెంచే తీర్మానం కూడా పాలకవర్గం ఆమోదించింది. ఇప్పటికే వివిధ సేవలు, దర్శనాల టికెట్ ధరలు అధికంగా ఉన్నాయని భావిస్తున్న భక్తులు, తాజా పెంపులతో దేవస్థాన సేవలు మరింత కమర్షియల్గా మారుతున్నాయనే విమర్శలు చేస్తున్నారు. భక్తుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని టికెట్ ధరల పెంపుపై దేవస్థాన అధికారులు మరింత స్పష్టత ఇవ్వాలని, పెంపునకు గల కారణాలను వెల్లడించాలని భక్తులు కోరుతున్నారు. మరోవైపు దేవస్థానం అభివృద్ధి, సేవల నిర్వహణ వ్యయాల దృష్ట్యా ధరల సవరణ అవసరమై ఉండవచ్చని కొందరు అభిప్రాయపడుతున్నప్పటికీ, సామాన్య భక్తులపై భారం పడకుండా నిర్ణయాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. దీంతో టికెట్ ధరల పెంపు అంశం ప్రస్తుతం అన్నవరం భక్తుల్లో చర్చనీయాంశంగా మారింది.

# యువత మద్యం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి




**పిఠాపురం, జూన్ 25(మనం న్యూస్):-** అంతర్జాతీయ మద్యం మాదక ద్రవ్యాల దినోత్సవం సందర్భంగా మద్యం మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో పట్టణం లో మద్యపాన అనర్ధాల పై కోట గుమ్మం సెంటర్ నుండి ఉప్పాడ సెంటర్ వరకు వరకు ప్రదర్శన నిర్వహించారు, మద్యం వద్దు- అరోగ్యం ముద్దు మాయదారి మద్యం- గంజాయి మాకు వద్దు బాబోయ్ అంటూ నినదాలు చేశారు. ఈ సందర్భంగా మద్యం మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎన్. సూర్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో మద్యం అమ్మకాలు పెంచుకోవడానికి దేశసంపద అయిన యువతరాన్ని నాశనం చేయడం దారుణమని ప్రజలు ఆహాలధాకారం ఉండే బీచ్ ల్లో మాత్రమే చూస్తుదని అలకాకుండా యువతకి ఉపాధి అ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జే వి వి జిల్లా కార్యదర్శి ఏలేటి నానిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కె. సింహాచలం పిఠాపురం మద్య పాన వ్యతిరేక కన్వీనర్ వనపర్తి సూర్యనారాయణ , కమిటీ సభ్యులు మిరియాల చంటి, అంజన జూనియర్ కళాశాల ప్రిన్స్ పాల్ మాగాపు మోహన్ రావు,శంకర్, స్టాలిన్ , అంజన జూనియర్ కాలేజీ ఆఫీస్ సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

# కుల రాజకీయాలు చేయడం వైసీపీ నేతలు మానుకోవాలి



**శంఖవరాౕ జూన్ 25 మనం ప్రతినిధి:** రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు జనసేన పార్టీ అధ్యక్షుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యా చేస్తున్న విమర్శలు పూర్తిగా రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని జనసేన పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి బాబి తీవ్రంగా మండిపడ్డారు.కత్తిపూడిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల ఆదరణ రోజురోజుకూ పెరుగుతున్న కూటమి ప్రభుత్వాన్ని ఎదుర్కోలేక వైసీపీ నాయకులు కులాల మధ్య చిచ్చు పెట్టే కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన వారు కుల రాజకీయాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూడడం దురదృష్టకరమన్నారు.పవన్ కళ్యాణ్ను ఒక కులానికి పరిమితం చేసే ప్రయత్నాలను జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు.పవన్ కళ్యాణ్ అన్ని వర్గాల ప్రజల కోసం పోరాడే నాయకుడని,ఆయనపై చేసే వ్యక్తిగత విమర్శలను ప్రజలు కూడా అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు.సమాజంలో విభేదాలు సృష్టించి రాజకీయంగా మనుగడ సాగించాలనే వైసీపీ ప్రయత్నాలను ప్రజలు ఎప్పటికీ అంగీకరించరని అన్నారు.గత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు నుంచి వైసీపీ ఎలాంటి గుణపాఠం నేర్చుకోలేదని,ఇదే అహంకార ధోరణి కొనసాగితే వచ్చే ఎన్నికల్లో 11 సీట్లు కూడా గెలుచుకోవడం కష్టమవుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ధర్మవరం,లింగంపర్తి సొసైటీ చైర్మన్లు దాసం శేషారావు,పెంటకోట మోహన్, తుని జోన్ ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ కరణం సుబ్రహ్మణ్యం, శంఖవరం మండల జనసేన అధ్యక్ష,ఉపాధ్యక్షులు,గాబు సుభాష్,తలపంటి బుజ్జి, ప్రత్తిపాడు మండల జనసేన అధ్యక్షుడు రామకుర్తి కామేష్,తలపంటి బుజ్జి, నాయకులు బంక కోదండరాం,సయ్యద్ గఫూర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సమాధానం చెప్పలేక వైసీపీ నాయకులు కులాల పేరుతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.రాష్ట్ర ప్రజలు అభివృద్ధి,సంక్షేమాన్ని కోరుకుంటున్నారని,విద్వేష రాజకీయాలను కాదని అన్నారు.కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా ప్రజల ఐక్యత కోసం జనసేన పనిచేస్తోందని,సమాజాన్ని విభజించే రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గంగిరెడ్ల మణికంఠ,ఆకుల నాని,దలే జ్యోతి,పిల్లా పద్మరాజు,తుమ్మల సత్యేంద్ర,మాగాపు వీరబాబు,కీర్తి కుమార్,తంతపురెడ్డి జయగంట,సర్పం జయబాబు,కోన సతీష్, కుండల సాయి,సైతిన సాయి,పిల్లి దుర్గ, గౌతు బుజ్జి,దొడ్డి శ్రీను,కర్రి వీరబాబు, మట్టపర్తి గణేష్,సాల వీరబాబు,వజ్రపు శ్రీనుబాబు, ఎజ్జు బుజ్జి,తేజ,పోసిన శ్రీను, కోటి పాల్గొన్నారు.

# అన్నవరం ధ్వజస్తంభంపై కలశ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహణ

**అన్నవరం జూన్ 25 మనం న్యూస్ :** అన్నవరం దేవస్థానంలో ధ్వజస్తంభంపై కలశ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇటీవల గాలివానల కారణంగా ఒరిగిపోయిన కలశం, చక్రాన్ని శాస్త్రోక్తంగా పునఃప్రతిష్ఠించారు. ముందుగా స్వామివారి ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవస్థానం చైర్మన్ రోహిత్, ఈవో వి. చక్రధర్ రావు సమక్షంలో వేద పండితులు, అర్చకులు మంత్రోచ్చారణల మధ్య కలశ ప్రతిష్ఠ చేపట్టారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. శాస్త్రోక్త విధానంలో పూజలు నిర్వహించి ధ్వజస్తంభంపై కలశాన్ని యథాస్థానంలో ప్రతిష్ఠించారు. ధ్వజస్తంభం, కలశం పూర్తిస్థాయిలో పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టిన అనంతరమే ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంతో భక్తుల్లో నెలకొన్న ఆందోళన తొలగిపోయిందని, దేవస్థానం అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించడం అభినందనీయమని పలువురు భక్తులు పేర్కొన్నారు.



# సత్యదేవుని నిత్య అన్నదాన పథకానికి రూ.5 లక్షల విరాళం



**అన్నవరం, జూన్ 25, మనం న్యూస్ :** శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి నిత్య అన్నదాన పథకానికి విజయవాడకు చెందిన దాతలు అంబటి జయ వెంకట చలపతి అంబటి వెంకటలక్ష్మి రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి విరాళాన్ని దేవస్థాన అధికారులకు అందించారు. తాము సమర్పించిన ఈ విరాళం ద్వారా ప్రతి సంవత్సరం మహాశివరాత్రి రోజున భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించాలని దాతలు తమ కోరికను వ్యక్తం చేశారు. భక్తులకు ఆహార సేవ అందించడం ద్వారా స్వామివారి అనుగ్రహం పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. దాతల ఉదారతను దేవస్థాన అధికారులు అభినందిస్తూ, నిత్య అన్నదాన పథకానికి అందుతున్న విరాళాలు వేలాది మంది భక్తులకు ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. భక్తులు కూడా ఇటువంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని అధికారులు కోరారు. ఈ సందర్భంగా దాతలకు దేవస్థానం తరఫున స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేసి సత్కరించారు. భక్తుల సహకారంతో నిత్య అన్నదాన పథకం మరింత విస్తృతంగా కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

# ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం

**కాట్రేనికోన జూన్ 25 మనం ప్రతినిధి** ఈ నెల 28 న నిర్వహించ బోయే పోలియో ఆదివారం ను జయప్రదం చేయాలని ఎంపీడీఓ బి రాజేశ్వర్ రావు పిలుపునిచ్చారు.నిండు జీవితానికి రెండు చుక్కలు చిన్నారుల ఆరోగ్యకర భవిష్యత్తుకి భరోసా అని ఈ సందర్భంగా తెలిపారు. గురువారం కాట్రేనికోన, పల్లంకుర్రు వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి ఏ ఎన్ ఎమ్, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఐదు సంవత్సరాలలోపు పిల్లలు అందరికీ ఆదివారం నాడు నిర్వహించబోయే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, పోలియో రహిత సమాజానికి ప్రతిఒక్కరు కంకణబద్ధులు కావాలని ఈ సందర్భంగా ఎంపీడీఓ హితవుపలికారు.28న నిర్వహించ బోయే పోలియో శిబిరాల యందు అంగన్వాడీ, ఏ ఎన్ ఎమ్, ఆశా కార్యకర్తలు పూర్తి బాధ్యతతో సమర్ధవంతంగా పని చేయాలని, అలసత్వం వహించరాదని ఎంపీడీఓ ఆదేశించారు. కార్యక్రమంలో కాట్రేనికోన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఎమ్ లిఖిత,మలేరియా సబ్ యూనిట్ అధికారి కె రామ్మోహన్ రావు, సూపర్ వైసర్ జె వి రమణమ్మ, పబ్లిక్ హెల్త్ నర్స్ జి రమాశేషులు, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## మాచాపురంలో మొహరం వేడుకలు



● గంగేసి వేషంలో చిన్నారి

నందవరం జూన్ 25 మనం న్యూస్: నందవరం మండల పరిధిలోనే మాచాపురం గ్రామంలో మొహరం వేడుకలు సందర్భంగా గంగేశాల ప్రదర్శన కనపరిచారు. గ్రామస్తులు మతాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో మొహరం పండుగలు గంగివేషాలతో ప్రజలను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మాకు మొహరం అంటే ఎంతో ప్రీతికా నిదర్శనమైన పండగ చాలా బాగా జరుపుకుంటామని గ్రామస్తులు తెలిపారు.

## బంగారు తాళిబొట్టు అప్పగింత




మహానంది, జూన్25,మనంన్యూస్: స్వామివారి దర్శనార్థమై వచ్చి ఆలయ ప్రాంగణంలో జారవిడుచుకున్న బంగారు తాళిబొట్టు చైన్ ను దేవస్థానం ఉద్యోగులు తిరిగి అప్పగించారు. గురువారం ఎమ్మిగనూరు కు చెందిన నిహారిక అనే మహిళ క్షేత్రంలో జరిగే బంధువుల వివాహానికి హాజరైంది.వినాయక నంది ఆలయ ప్రాంతంలో ఒక భక్తుడు గమనించి దేవస్థానం కార్యాలయంలో సిబ్బందికి అప్పగించారు. వెంటనే మైకులో చెప్పడంతో ఆ మహిళ టెంపుల్ కార్యాలయంలో వివరాలు తెలపడంతో సూపర్డెంట్ శశిధర్ రెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగ మల్లయ్య లు అప్పగించారు. భక్తురాలు, వారి బంధువులు దేవస్థానం ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రికార్డ్ అసిస్టెంట్ ఈశ్వర్,నాగరాజు తదితరులు ఉన్నారు.

## ఉద్యాన పంటలపై రైతులు దృష్టి సారించాలి



తుగ్గలి జూన్ 25(మనం న్యూస్ ): వ్యవసాయంతో పాటు ఉద్యాన పంటలపై రైతులు దృష్టి సారించాలని ఈసీ రాజశేఖర్ అన్నారు.వీబీ జీ రామ్ జీ కార్యక్రమంలో భాగంగా రాంపల్లి గ్రామ పొలాల్లో పండ్ల మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథి తెదేపా టిడిపి మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు హాజరై ప్రారంభించారు.రైతులు ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి చూపేలా అవగాహన కల్పిస్తూ, వారి పొలాల్లో పండ్ల మొక్కలను వారు నాటారు.ఈ సందర్భంగా ఈసీ రాజశేఖర్ మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకం ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా ఆదాయం లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఉద్యాన పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. వీబీ జీ రామ్ జీ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించడంతో పాటు రైతుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## జొన్నగిరి గోల్డ్‌మైన్స్ రతనాలసీమ దిశగా అడుగులు



● 'ఎమ్మెల్యేలకు ఘన సత్కారం

తుగ్గలి, జూన్ 25:(మనం న్యూస్ ): జొన్నగిరి గోల్డ్‌మైన్స్ ప్రారంభోత్సవం విజయవంతంగా జరగడంతో అందుకు కృషి చేసిన పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ శ్యామ్ బాబు,కోడుమూరు బొగ్గుల దస్తగిరి జొన్నగిరికి చెందిన తెదేపా నేతలు మిద్దె రవికుమార్ యాదవ్, మిద్దె వెంకటేష్ యాదవ్ ఘనంగా సన్మానించారు.

గురువారం గోల్ మైన్స్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కే.ఈ శ్యామ్ కుమార్ కు, బొగ్గుల దస్తగిరి కు శాలువా కప్పి, పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో జొన్నగిరి గోల్ మైన్స్ ప్రారంభమైందన్నారు. ఈ ప్రాజెక్టు రాయలసీమ అభివృద్ధికి కీలక మలుపుగా నిలుస్తుందని, భవిష్యత్తులో ఈ ప్రాంతం రతనాలసీమగా మారే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.

గోల్ మైన్స్ ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, రైతులు, ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక ప్రయోజనాలు అందుతాయని తెలిపారు.

టీడీపీ నాయకుడు మిద్దె వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న జొన్నగిరి గోల్ మైన్స్ కల సాకారమైందని అన్నారు. ఈ ప్రాజెక్టు ప్రారంభానికి ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

# ఆర్యవైశ్యులకు కూటమి ప్రభుత్వంతోనే న్యాయం

### తాడిపత్రిలో అనంతపురం జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం

### కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి టీజీ భరత్ గుప్తా, సీనియర్ నాయకులు జె.సి ప్రభాకర్ రెడ్డి



కర్నూలు జూన్ 25మనం న్యూస్ : ఆర్యవైశ్యులకు కూటమి ప్రభుత్వంలోనే పూర్తి న్యాయం జరుగుతోందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా అన్నారు. తాడిపత్రిలో అనంతపురం జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్ గుప్తాతో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరి సమక్షంలో నూతన కమిటీల ప్రమాణ స్వీకారం జరిగింది. అనంతరం మంత్రి టీజీ భరత్ గుప్తా మాట్లాడుతూ నూతనంగా ఏర్పడ్డ కమిటీలు పదవులకు న్యాయం చేయాలని సూచించారు. ఇక కర్నూలు జిల్లాలో సీఎం చంద్రబాబు నాయుడు పర్యటన ఉన్నప్పటికీ ఆర్యవైశ్యుల కార్యక్రమానికి హాజరయ్యేందుకు అనుమతి తీసుకొని వచ్చినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమం గురించి చెప్పగానే సీఎం చంద్రబాబు ఆర్యవైశ్యుల కార్యక్రమానికి తప్పకుండా హాజరవ్వాలని తనతో చెప్పినట్లు మంత్రి చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్.. ఆర్యవైశ్యుల తరుపున సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.ఇక ఆర్యవైశ్యులందరూ కలిసికట్టుగా ఉండి ఐక్యత చాటుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్యవైశ్య సంస్థలన్నీ కలిసి కార్తీక వనభోజన కార్యక్రమాన్ని కలిసి కట్టుగా నిర్వహించాలన్నారు. ఐక్యంగా ఉంటే సమాజంలో గౌరవం దక్కుతుందన్నారు. తన తండ్రి టీజీ వెంకటేష్ ఆర్యవైశ్యులకు అండగా ఉంటున్నారన్నారు. వందల కోట్లు విలువ చేసే ఆస్తులు కాపాడటంలో ఆయన కీలక పాత్ర పోషించినట్లు గుర్తు చేశారు. డిసెంబర్ నెలలో బెంగుళూరులో గ్లోబల్ యాక్సిలరేటర్ విజన్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆర్యవైశ్యులందరూ ఈ సమావేశంలో పాల్గొని ఆలోచనలు పంచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరు లక్ష్మయ్య, గౌరవాధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షులు సురేంద్రనాథ్ గుప్తా, తాడిపత్రి మార్కెట్ యార్డు చైర్మన్ భూమా నాగరాగిణి, ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి రంగనాథ్, పోతుల సురేష్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ సిద్దా సూర్య ప్రకాష్, వాసవి సేవాదళ్ అధ్యక్షుడు శబరి వరప్రసాద్, వాసవి సత్ర సముదాయాల గౌరవాధ్యక్షులు సిద్దా నాగేశ్వరరావు, మహిళా విభాగ్ అధ్యక్షురాలు రజిని, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల స్వరానికి కాంగ్రెస్ వేదిక

● జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు క్రాంతి నాయుడు



కర్నూలు జూన్ 25మనం న్యూస్ : అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జూన్ 25న జెడ్పి సమావేశ మందిరంలో నిర్వహించిన ఛాత్రోన్ కీ గూంజ్ విద్యార్థుల సంప్రదింపుల సమావేశానికి విద్యార్థులు, యువజన ప్రతినిధులు, విద్యావేత్తలు మరియు కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రస్తుత విద్యా వ్యవస్థలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా నీట్ , జె ఈ ఈ వంటి పోటీ పరీక్షలలో పెరుగుతున్న ఒత్తిడి, కోచింగ్ సెంటర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి, అధిక విద్యా వ్యయాలు, పరీక్షల నిర్వహణలో లోపాలు, పేపర్ లీకులు, విద్య పూర్తయిన తర్వాత ఉద్యోగ అవకాశాల కొరత వంటి అంశాలపై తమ ఆవేదన వ్యక్తం చేశారు. వక్తలు మాట్లాడుతూ దేశ యువత భవిష్యత్తు విద్యా వ్యవస్థపై ఆధారపడి ఉందని, విద్యార్థుల ప్రతిభను కేవలం ఒక పరీక్ష లేదా ర్యాంక్తో కొలవడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎస్సీ బజారన్న, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు, సేవాదళ్ జిల్లా చైర్మన్ సజ్జాద్ హుస్సేన్, ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్ మారుతీ రావు, డిసిసి మాజీ అధికార ప్రతినిధి చిన్న రామాంజనేయులు, ఎస్సీ సెల్ మాజీ జిల్లా చైర్మన్ ఈ లాజరస్, డిసిసి మాజీ ఉపాధ్యక్షులు దిలీప్ ఢోకా, చిన్న నరసింహులు, డి సి సి మాజీ ప్రధాన కార్యదర్శులు, రియాజుద్దీన్, సయ్యద్ నవీద్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిన్నస్వామి, విద్యార్థి సంఘాల నాయకులు ఆనందబాబు, భరత్ కుమార్ ఆచారి, రంగ ముని నాయుడు, రవికుమార్ యూత్ కాంగ్రెస్ నాయకులు శ్రీనిధి రాయల్, ఐఎన్టీయూసీ సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్, కాంగ్రెస్ నాయకులు మంత్రాలయం గోవర్ధన్ రెడ్డి, వెల్దుర్తి శేషయ్య, వశీ భాష, లక్ష్మన్న, ఎజాస్, ఫిరోజ్, , విద్యార్థిని, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హజ్-2027 దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

● యాత్రికులు సద్వినియోగం చేసుకోవాలి

● ఏపీ హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ బాషా మరియు హజ్ కమిటీ సభ్యులు సూరి మన్సూర్ అలీ ఖాన్



కర్నూలు జూన్ 25మనం న్యూస్ : భారత ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని హజ్ కమిటీ ఆఫ్ ఇండియా విడుదల చేసిన హజ్-2027 (1448 హిజ్రీ) నోటిఫికేషన్ను రాష్ట్రంలోని ముస్లిం సోదర సోదరీమణులు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ బాషా పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ ఎన్.ఎం.డి. ఫరూక్ సహకారంతో మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని ఆయన తెలిపారు. హజ్ యాత్రికులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర హజ్ కమిటీ కట్టుబడి ఉందన్నారు. హజ్-2027 దరఖాస్తులను 22 జూన్ 2026 నుండి 20 జూలై 2026 రాత్రి 11:59 గంటల వరకు ఆన్లైన్లో సమర్పించవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు హజ్ సువిధ యాప్ లేదా హజ్ కమిటీ ఆఫ్ ఇండియా అధికారిక వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుతో పాటు 31-12-2027 వరకు చెల్లుబాటు అయ్యే భారతీయ పాస్పోర్ట్, తెలుపు నేపథ్యంతో పాస్పోర్ట్ సైజు ఫోటో, బ్యాంక్ పాస్బుక్ లేదా రద్దు చేసిన చెక్కు, చిరునామా ధృవీకరణ పత్రం అప్లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. జూలై చివరి వారంలో నిర్వహించే ఖుర్రా (డిజిటల్ లాటరీ) అనంతరం ఎంపికైన యాత్రికులు రూ.1,52,300/- అడ్వాన్స్ మొత్తాన్ని 10 ఆగస్టు 2026లోపు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. హజ్ సీట్ల రద్దు వల్ల పరిపాలనా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున, యాత్రకు పూర్తి సిద్ధత మరియు దృఢ సంకల్పం ఉన్నవారే దర. ఖాస్తు చేసుకోవాలని హజ్ కమిటీ సభ్యులు సూరి మన్సూర్ అలీ ఖాన్ సూచించారు.

## ఎరువుల మందుల అమ్మకాలు నిలుపుదల



మహానంది, జూన్25,మనంన్యూస్: నిబంధనలకు విరుద్ధంగా వున్న ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు ఏ ఓ నాగేశ్వర రెడ్డి తెలిపారు. గురువారం మహానంది మండలంలోని బుక్కాపురం గ్రామంలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ సబ్ ఇన్స్పెక్టర్ వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో ఎరువులు మరియు పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేయడం జరిగినది. ఈ తనిఖీలో స్టాక్ రిజిస్టర్ లో నిల్వలకు భౌతిక నిల్వలకు తేడాలు ఉన్నందున శ్రీ మహానందీశ్వర ఏజెన్సీస్ ఎరువులు మరియు పురుగు మందుల దుకాణంలో 1,43, 800 రూపాయలు విలువజేసే 3.7 టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ మండలంలోని ఎరువుల డీలర్లు ఎరువుల నియంత్రణ చట్టానికి లోబడి వ్యాపారం చేయాలని ఆదేశించడం జరిగినది. ఎరువులను బస్తా పైన ఉన్న ఎమ్మార్పీ ధరలకే అమ్మాలని అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం జరిగినది. అనుమతులు ఉన్న ఎరువులను మాత్రమే అమ్మాలని ఎప్పటికప్పుడు ఫారం ఓ లను లైసెన్స్ లో ఇంక్లూడ్ చేసుకోవాలని తెలియజేయడం జరిగినది. స్టాక్ రిజిస్టర్ లో నిల్వలకు, భౌతికంగా ఉన్న నిలువలకు, ఈపాస్ మిషన్ నిల్వలకు మరియు ఏపీ ఏఐఎంఎస్ యాప్ లో ఉన్న నిల్వలకు అన్ని సమానంగా ఉండాలని హెచ్చరించడం జరిగినది. డీలర్లు అందరూ ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా మాత్రమే ఎరువులను అమ్మాలని తెలియజేయడం జరిగినది. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో యూరియా మరియు డిఏపి ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా తమకు కావలసిన యూరియా మరియు డిఏపి ఎరువులను కొనుగోలు చేయవచ్చునని తెలిపారు.

## ఏలూరు రైతు సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



తుగ్గలి, జూన్ 25:(మనం న్యూస్ ): జూలై 3, 4, 5 తేదీలలో ఏలూరులో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని తుగ్గలి మండల రైతులకు రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రైతు సంఘం కార్యదర్శి ఎర్రగుడి కొండారెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు రాంపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ రైతుల సమస్యలు, హక్కులు, వ్యవసాయ రంగ అభివృద్ధి అంశాలపై చర్చించేందుకు నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. రైతుల సంక్షేమం కోసం రైతు సంఘం నిరంతరం పోరాడుతోందని, ప్రతి రైతు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని వారు సూచించారు. ఈ సమావేశంలో రైతులు ఈరన్న, సుధాకర్, సురేష్, హనుమన్న, ఆంజనేయ, గంగాధర్, నాగరాజు, సీనప్ప తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి



మహానంది, జూన్25,మనంన్యూస్: ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఈఓ శ్రీనివాసరెడ్డి సిబ్బందికి సూచించారు. గురువారం ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. అలాగే చిన్న కోనేరు ప్రాంతంలో కొంత భాగం కుంగిపోవడం తో భక్తులకు అసౌకర్యంగా ఉంటుందని త్వరగా బాగుచేయాలని ఏ ఈ శ్రీనివాసులుకు తెలిపారు. ఆయన వెంట సూపర్డెంట్ నీల ఖంటేశ్వర రాజు, టెంపుల్ ఇన్స్పెక్టర్ మల్లయ్య,రికార్డ్ అసిస్టెంట్ ఈశ్వర్, వున్నారు.

## అంతర్జాతీయ స్థాయి గ్రీన్ పోస్టర్ చిత్రలేఖన పోటీల తేదీ మార్పు



కర్నూలు జూన్ 25మనం న్యూస్ : జులై 21 న అసోసియేషన్ ఆఫ్ ఆలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్,నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ ల సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి గ్రీన్ పోస్టర్ చిత్రలేఖన పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా 117 మాజీ గవర్నర్, మాజీ ఇంటర్నేషనల్ కౌన్సిల్ చైర్ పర్సన్ అల్లీ అండ్ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు నుంచి ఎనిమిది సంవత్సరాల లోపు వారిని జూనియర్స్ గానూ తొమ్మిది నుంచి పదమూడు సంవత్సరాల వారిని సీనియర్స్ గాను పరిగణిస్తారని జిల్లా స్థాయి విజేతలకు మొదటి బహుమతి 1500 ల రూపాయలు,రెండవ బహుమతి వెయ్యి రూపాయలు మూడవ బహుమతి 700 రూపాయల తో పాటు 10 మందికి కన్సోలేషన్ బహుమతులు, పాల్గొన్న ప్రతి వక్కరికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్స్ అందజేయబడతాయన్నారు. జిల్లా స్థాయిలో ఎంపిక కాబడిన వారికి అంతర్జాతీయ స్థాయి పోటీలకు పంపించనున్నామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఎంపిక కాబడిన వారికి ప్రథమ బహుమతి 50వేల రూపాయలు రెండవ బహుమతి 25వేల రూపాయలు మూడవ బహుమతి 5000 తో పాటు కన్సోలేషన్ బహుమతులు అంతర్జాతీయ స్థాయి గ్రీన్ అవార్డులు అందజేయబడతాయన్నారు. జిల్లాస్థాయి పోటీలు 25న ఉదయం 11 గంటలకు నిర్వహించబడతాయని ఆసక్తిగలవారు తమ పేర్లను జులై 15 వ వ తేదీలోగా వెంక టరమణ కాలనీ మొదటి లైన్ లో ఉన్న నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో నమోదు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు 9396861308 నంబర్ ను సంప్రదించవచ్చన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన మంత్రి సవితమ్మ



గోరంట్ల, జూన్ 25 మనం న్యూస్: బీసీ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖల మంత్రి శ సవితమ్మ గురువారం గోరంట్ల మండలంలోని పలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మొదటగా వడిగేపల్లి పంచాయతీ బత్తలపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుడు సన్నప్ప కుమారుడి వివాహ వేడుకకు మల్లాపల్లిలోని రాధాకృష్ణ ఫంక్షన్ హాల్లో హాజరైన మంత్రి సవితమ్మ, నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గోరంట్లలోని ఎంఎంఎస్ ఫంక్షన్ హాల్లో పల్లి గ్రామానికి చెందిన భూత్ కన్వీనర్ గంగాధర్ కుమార్తె, మల్లాపల్లికి చెందిన తలారి లింగప్ప కుమారుడి వివాహ కార్యక్రమంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. తదుపరి గోరంట్లలోని వాసవి కళ్యాణమండపంలో బూదిలవాండ్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బాలకృష్ణ కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా గోరంట్ల మండలం ఖాజాపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు శివ శంకర యాదవ్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి సవితమ్మ మాట్లాడుతూ, కుటుంబ బంధాలు, సంప్రదాయాలు సమాజానికి బలమైన పునాదులని పేర్కొన్నారు. నూతన వధూవరులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, 3స్థానిక ప్రజాప్రతినిధులు మరియు అభిమానులు పాల్గొన్నారు

## డివిజనల్ పంచాయతీ అధికారిగా వెంకటేశులు బాధ్యతల స్వీకరణ



ధర్మవరం అర్బన్, జూన్ 25, మనం న్యూస్: ధర్మవరం డివిజనల్ పంచాయతీ అధికారిగా ఏలూరి వెంకటేశులు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డులో ఉన్న డివిజనల్ పంచాయతీ అధికారి కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది.జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఇప్పటివరకు ఈ కార్యాలయంలో విధులు నిర్వహించిన శివకుమారిని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్గా కడపకు బదిలీ చేయగా, వెంకటేశులు ఎఫ్ఏసీ (పూర్తి అదనపు బాధ్యతలు) కింద బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా వెంకటేశులు మాట్లాడుతూ, పంచాయతీ శాఖ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది సహకారం, సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా పనిచేస్తానన్నారు.అనంతరం కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## మోదీ, చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్రాభివృద్ధి

● మంత్రి సత్య కుమార్ యాదవ్

● మరో 15 ఏళ్లు కూటమి అధికారంలో ఉంటుందన్న పరిటాల శ్రీరామ్

● ధర్మవరంలో కూటమి విజయోత్సవ సభ




ధర్మవరం అర్బన్, జూన్ 25, మనం న్యూస్: కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వం కొనసాగితేనే... ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం ధర్మవరం పట్టణంలో విజయోత్సవ కార్యక్రమాన్ని సిఎన్బి ఫంక్షన్ హాల్ నందు కూటం ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రధాని మోదీ పాలనకు 12 ఏళ్లు, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం ధర్మవరంలో నిర్వహించిన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. దేశంలో మోదీ నాయకత్వంలో ఆర్థికాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. పేదరిక నిర్మూలన, దేశ భద్రత, మౌలిక వసతుల అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, మహిళలు, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.ఈ సందర్భంగా వైసీపీ పాలనపై మంత్రి విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలవుతుండటాన్ని ఓర్వలేక ప్రతిపక్షం కుల రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఆరోగ్యశ్రీ పథకం అమలు, సూపర్ సిక్స్ హామీల అమలుపై వచ్చిన విమర్శలకు గణాంకాలతో సమాధానం ఇచ్చారు. ధర్మవరం నియోజకవర్గంలో ఇప్పటికే రూ.1,600 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలుచేసినట్లు మంత్రి తెలిపారు. చేనేత రంగ అభివృద్ధికి దేశంలో మంజూరైన ఏకైక మెగా క్లస్టర్ను ధర్మవరానికి తీసుకొచ్చినట్లు చెప్పారు. అనంతరం టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకొస్తున్నారని, రైతులకు సాగునీటి సమస్యలు పరిష్కరించే చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పీఏబీఆర్ కుడికాలువను హంద్రీ-నీవా ప్రధాన కాలువతో అనుసంధానం చేసే ప్రణాళికను ప్రస్తావించారు. మరో 15 ఏళ్లపాటు కూటమి అధికారంలో కొనసాగితే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు.

జనసేన నాయకుడు చిలకం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతుండటాన్ని చూసి వైసీపీ నాయకులు కుల రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కులాలు, మతాల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం శాంతిభద్రతల పరిస్థితి మెరుగుపడిందన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు

● సర్ కార్యక్రమాలపై మంత్రి సవితమ్మసమీక్ష



గోరంట్ల, జూన్ 25మనం న్యూస్: మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ )కార్యక్రమాల పురోగతిపై రాష్ట్ర బీసీ సంక్షేమ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత,జౌళి శాఖ మంత్రి ఎస్. సవితమ్మ గోరంట్లలో సమీక్ష నిర్వహించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో బూత్ వారీగా కార్యక్రమాల అమలును పరిశీలించి, ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా కార్యక్రమాలను నిర్వహించాలని, ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎటువంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. సర్ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు బూత్ స్థాయి నుంచి మండల స్థాయి వరకు అందరూ సమష్టిగా పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల బాధ్యులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు



## బాలయ్య-కొరటాల సినిమా షురూ

కొరటాల శివ దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. 'NBK 112' వర్కింగ్ టైటిల్ తో తెరకెక్కబోతున్న ఈ చిత్రం పూజా కార్యక్రమం అమరావతిలో ఘనంగా జరిగింది. బాలకృష్ణ అల్లుడు, ఏపీ మంత్రి నారా లోకేష్ ముఖ్యఅతిథిగా హాజరరై క్లాప్ కొట్టగా.. బాలయ్య చిన్న కూతురు తేజస్వీని కెమెరా స్విచ్ ఆన్ చేశారు. బాలయ్య ఓ డైలాగ్ చెప్పి అలరించాడు. ఈ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేశ్, నిర్మాత సురేశ్ బాబుతోపాటు మరికొందరు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు. ఆగస్ట్ నుంచి ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు మేకర్స్ తెలిపారు. 2027లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

## శర్వాకి హీరోయిన్ ఫిక్స్.. ఫస్ట్ షెడ్యూల్ అప్పుడే !





దర్శకుడు శ్రీను వైట్ల - హీరో శర్వానంద్ కాంబినేషన్ లో రాబోతున్న సినిమా 'జార్జ్ క్రిష్'. ఈ సినిమాలో నటించే హీరోయిన్ గురించి ఇప్పటికే చాలా రూమర్స్ వచ్చాయి. ఐతే, తాజాగా వినిపిస్తున్న అప్ డేట్ ప్రకారం.. భాగ్యశ్రీ బోర్సే ను హీరోయిన్ గా ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. కానీ, ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఇక ఆగస్టు మొదటి వారం నుంచి ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్ లో ఓపెనింగ్ సన్నివేశాలను చిత్రీకరిస్తారని, అనంతరం జరగబోయే రెండో షెడ్యూల్ లో హీరో - హీరోయిన్ల పై లవ్ సీన్స్ ను షూట్ చేస్తారని తెలుస్తోంది. అన్నట్టు ఈ సినిమాను సంక్రాంతి బరిలో దించాలని గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఐతే, గోపీచంద్ హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ కామెడీ 'విశ్వం' ఏవరేజ్ గా నిలిచింది. దీంతో, ఎలాగైనా మళ్ళీ టాలీవుడ్ లో తన తర్వాత సినిమాతో బిజీ అయ్యేందుకు శ్రీనువైట్ల తెగ కష్ట పడుతున్నాడట. ఈ క్రమంలోనే శర్వాకి కథ చెప్పాడు. కాగా తెలియని వయసులో ఆవేశంలో చేసిన ఓ పని కారణంగా హీరో లైఫ్ లో జరిగే డ్రామా చాలా బాగుంటుందట. మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మించనుంది.

# తొలి వన్డే ప్రపంచ కప్ గెలిచి 43 ఏళ్లు!

**వివ్ రిచర్డ్స్, క్లైవ్ లాయిడ్, గ్రీనిడ్జ్, డెస్మండ్ హైన్స్.. క్రీజ్ లోకి వచ్చారంటే టాప్ బౌలరైనా ఖంగు తినాల్సిందే..**

**మాల్కమ్ మార్షల్, ఆండీ రాబర్ట్స్, మైకెల్ హోల్డింగ్.. ఈ పేర్లు వింటే అప్పట్లో ఎంతటి బ్యాటర్లకైనా వెన్నులో వణుకే.**

**హ్యాట్రిక్ వరల్ కప్ పై గురి పెట్టిన వెస్టిండీస్ అనే భయంకరమైన జట్టు బరిలోకి దిగింది. అనుకున్నట్లుగానే ఫైనల్ కు చేరుకుంది.. కానీ, ఓ అనామక (అప్పటికి) జట్టు చేతిలో ఓటమిపాలై వెళ్తామని కనీసం ఎవరూ ఊహించి ఉండరు. ప్రపంచ క్రికెట్ లో 'టీమ్ఇండియా'తో జాగ్రత్తగా ఉండాలని ప్రత్యర్థులు అనుకొనే రోజుకు నాంది పడి ఇప్పటికి 43 ఏళ్లు.**

అది 1983 జూన్ 25.. వన్డే ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచ్ జరిగిన రోజు ఇది. టీమ్ఇండియా చరిత్రలో తొలిసారి ఐసీసీ కప్పును సగర్వంగా అందుకొన్నది ఆరోజే. కపిల్ దేవ్ సారథ్యంలోని భారత్ ఫైనల్ లో వెస్టిండీస్ ను చిత్తు చేసి మరీ లారడ్స్ లో టైటిల్ ను సొంతం చేసుకుంది. ఈ ప్రపంచ కప్ లో టీమ్ఇండియా ప్రయాణమే సంచలన విజయంతో ఆరంభమైంది. ఆ తర్వాత కెప్టెన్ కపిల్ దేవ్ సూపర్ ఇన్నింగ్స్తోపాటు మిగతా ప్లేయర్ల సహకారంతో ఫైనల్ కు చేరుకుంది. అక్కడా బలమైన విండీస్ ను సమష్టిగా ఓడించింది.

ఈ వరల్ కప్ లో తొలి మ్యాచ్నే వెస్టిండీస్ తో భారత్ ఆడాల్సి వచ్చింది. హేమాహేమీ బౌలర్లను ఎదుర్కొని మరీ 60 ఓవర్లలో 262/8 స్కోరు చేసింది. అనంతరం స్టార్ బ్యాటర్లను త్వరగా పెవిలియన్ కు చేర్చి విండీస్ ను 228 పరుగులకే ఆలౌట్ చేసింది.


విండీస్ తో మ్యాచ్ తర్వాత.. జింబాబ్వేపైనా భారత్ గెలిచింది. వరుసగా రెండు మ్యాచుల్లో గెలిచి ఊపు మీదున్న టీమ్ఇండియాకు ఆస్ట్రేలియా రూపంలో తొలి ఓటమి ఎదురైంది. ఆ తర్వాత విండీస్ తోనూ పరాజయం తప్పలేదు.

ఆ తర్వాత జింబాబ్వేతో కీలక పోరులో కెప్టెన్ కపిల్ దేవ్ (175₹) సూపర్ ఇన్నింగ్స్ తో భారత్ గట్టెక్కింది. ఈ మ్యాచ్ లైవ్ కవరేజీ లేకపోవడం ఇప్పటికీ భారత అభిమానులను బాధపెట్టించే అంశమే. ఆ ఊపుతో ఆస్ట్రేలియానూ సెకండ్ రౌండ్ మ్యాచ్ లో టీమ్ఇండియా చిత్తు చేసింది. లీగ్ స్టేజ్ లో రెండు మ్యాచుల్లోనే ఓడి సెమీస్ కు దూసుకొచ్చింది. ఇక సెమీస్ లోనూ ఇంగ్లాండ్ అద్భుత విజయం నమోదు చేసింది.

మళ్లీ ఫైనల్ కు డిఫెండింగ్ ఛాంపియన్ వెస్టిండీస్ వచ్చింది. భారత్ తొలుత బ్యాటింగ్ చేసింది. కేవలం 183 పరుగులకే ఆలౌటైంది. దీంతో హ్యాట్రిక్ కప్పు విండీస్ సొంతమని చాలా మంది భావించారు. కామెంటేటర్లు కూడా ఇదే మాట చెప్పారు. కానీ, మ్యాచ్ జరిగే కొద్దీ విండీస్ ఫ్యాన్స్ నీరుగారిపోయారు. వెస్టిండీస్ కేవలం 140 పరుగులకే కుప్పకూలడంతో భారత్ తొలి కప్పును ముద్దాడింది.

జింబాబ్వేపై కపిల్ ఆడిన 175 ఇన్నింగ్స్ ఎంత విలువైందో.. ఫైనల్ లో కపిల్ దేవ్ వెనక్కి పరుగెడుతూ రిచరడ్స్ ఇచ్చిన క్యాచ్ ను అందుకోవడమే టర్నింగ్ పాయింట్.

లారడ్స్ లో కపిల్ దేవ్ తన చేతులతో కప్పు అందుకొన్న క్షణం కేవలం అతడికే కాదు.. యావత్ భారతావనికి మరిచిపోలేని సన్నివేశం. అన్నట్లు.. ఫైనల్ లో వెస్టిండీస్ పై టీమ్ఇండియా చేసిన పరుగులు 183.. అందులోనే ఉంది కదా.. ఇది భారత్కు '1'వ కప్.. '83'లో సాధించామనే గుర్తు..





# టీ20 కెప్టెన్సీ.. ఇన్స్టా బయో మార్చిన శ్రేయస్ అయ్యర్

ఐర్లాండ్తో రెండు టీ20 సిరీస్ తో శ్రేయస్ అయ్యర్ కెప్టెన్ గా బాధ్యతలు చేపట్టనున్నాడు. ఈ క్రమంలో తన ఇన్స్టాగ్రామ్ బయోను మార్చడం ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. తన రెండో పుట్టిన తేదీ అంటూ అందులో మెన్షన్ చేయడం గమనార్హం. 1994 డిసెంబర్ 6న శ్రేయస్ అయ్యర్ జన్మించాడు. అయితే, క్రికెట్ కెరీర్ పరంగా తనకు గతేడాది డిసెంబర్ 25న రెండో లైఫ్ వచ్చినట్లు రాసుకొచ్చాడు. దీంతో సోషల్ మీడియాలో అతడి అభిమానులు కామెంట్లతో ముంచెత్తారు.

''శ్రేయస్ అయ్యర్ 25.12.2025నాడు గాయం నుంచి కోలుకుని బ్యాట్ ను అందుకొన్నాడు. ప్రాణం పోయే పరిస్థితి నుంచి బయటపడ్డాడు. ఇది కేవలం క్రికెట్ లోకి పునరాగమనం చేసిన రోజే కాదు.. తన జీవితంలో కొత్త జీవితానికి నాంది పలికాడు. అందుకే అతడికి ఇది స్పెషల్. అక్కడ్నుంచి తన ప్రయాణం ఫ్రెష్ గా మొదలుపెట్టాడు. క్రమశిక్షణతో చాలా కష్టపడ్డాడు'' అని ఓ అభిమాని తన సోషల్ మీడియా ఖాతాలో రాసుకొచ్చాడు.




# ఓజీ 2
## నుంచి బ్లాక్ బస్టర్ అప్డేట్

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ కు అదిరిపోయే గుడ్ న్యూస్ అందింది. ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా, యంగ్ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన గ్యాంగ్ స్టర్ డ్రామా 'ఓజీ'. బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన ఈ మూవీకి సీక్వెల్ గా 'ఓజీ 2' రానున్నట్లు ఇప్పటికే అఫీషియల్ అనౌన్స్ మెంట్ వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా ఆ సినిమా పనులు అధికారికంగా ప్రారంభమయినట్లు తెలుపుతూ చిత్రబృందం ఓ స్పెషల్ వీడియోను షేర్ చేశారు. అనే హ్యాష్ ట్యాగ్ తో 'గంభీర కథ సిద్ధమవుతోంది.. తుపాను రావడానికి ముందు నిశ్శబ్దం ఉంటుంది' అనే పవర్ ఫుల్ క్యాప్షన్ తో షేర్ చేసిన ఈ వీడియో ప్రజెంట్ నెట్టింట వైరల్ అవుతూ పవర్ స్టార్ ఫ్యాన్స్ తో పాటు మూవీ లవర్స్ ను సైతం ఆకట్టుకుంటోంది.

ఇక విడుదలైన వీడియోలో డైరెక్టర్ సుజీత్ తో కలిసి పవన్ కల్యాణ్ స్క్రిప్ట్ పై చర్చిస్తున్నట్లు చూపించారు. మొత్తం స్క్రిప్ట్ చర్చించుకున్న తర్వాత పవన్ కల్యాణ్ చివరిలో 'నేను రెడీ' అని చెప్పడం మెగా అభిమానులను విపరీతంగా ఆకర్షిస్తోంది. దీంతో 'ఓజీ 2' షూటింగ్ త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుందని స్పష్టమవుతుండగా.. ఫ్యాన్స్ పండుగ చేసుకుంటున్నారు. 'ఓజీ'కి మ్యూజిక్ అందించిన థమన్.. ఈ సీక్వెల్ కు కూడా సంగీతం అందించనున్నారు. డీవీవీ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు.





# 'మీ దుస్తులు మీ ఇష్టం.. వాడి కళ్లు వాడి ఇష్టం'



ప్రముఖ టాలీవుడ్ సింగర్ సునీత మహిళలపై ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూకు హాజరైన ముఖ్యంగా మహిళల వస్త్రధారణపై ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె ఫెమినిజం గురించి షాకింగ్ కామెంట్స్ చేశారు. నా బాడీ.. నా హక్కు అన్నప్పుడు మీ ఇష్టమైన దుస్తులు ధరించవచ్చని సునీత తెలిపింది. మిమ్మల్ని ఎవరు చూడలేదని మీకు అనిపించినప్పుడు ఎలాంటి బట్టలు వేసుకున్న తప్పులేదన్నారు. అదే సమయంలో అవతలి వ్యక్తి కళ్లు.. అతని ఇష్టమని పేర్కొన్నారు. అవతలివాళ్లు మిమ్మల్ని చూడడంలో ఎలాంటి తప్పులేదని సునీత అన్నారు. ఈ సందర్భంగా ఇండస్ట్రీలో మహిళలు ఎదుర్కొనే సమస్యల గురించి కూడా ఆమె ఇంటర్వ్యూలో చర్చించారు. సునీత మాట్లాడుతూ..' సినీ ఇండస్ట్రీలో నో చెప్పడం అనేది మామూలు విషయం కాదు. అలా చెబితే ఇక్కడ అవకాశాలు రావడం చాలా అరుదు. ఈ విషయంలో ఎవరు కూడా అతీతులు కాదు. ఇండస్ట్రీలో నాకు వచ్చిన అవకాశాలు నన్ను ఓ స్థాయిలో నిలబెట్టాయి. ఇంతకుమించి నేను ఎక్కువ ఆశించలేదు. ఇదే మన లైఫ్ అనుకుంటే సమస్యలు వస్తాయి. సింగర్ అవకాశాలు రాకపోతే వెళ్లి వ్యవసాయం చేసుకుంటా. మహిళలు వాళ్లకు ఇష్టం వచ్చినట్లు బట్టలు వేసుకోవచ్చు. తప్పులేదు.. కానీ అవతలి వ్యక్తులను నువ్వు ఎంతమందిని మారుస్తారు. మీకు నచ్చిన దుస్తులు ధరించండి.. కానీ దానిని స్వేచ్ఛ.. హక్కు అని పిలవకండి. అవతలి వ్యక్తులను మార్చడం కంటే మనల్ని మార్చుకోవడం చాలా సులభం. సమాజంలో మహిళను చూసే పరిస్థితి చాలా దారుణం. ఇక్కడ మాటలు, చూపులతోనే హార్ట్ చేస్తారు. ఎవరు కూడా ఇక్కడ మహిళల మాటకు విలువ ఇచ్చిన సందర్భాలు నేను చూడలేదు' అని అన్నారు. మహిళలు ధరించే దుస్తులకు, ఫెమినిజంకు ఎలాంటి సంబంధం లేదని సింగర్ సునీత అన్నారు. ఇక్కడ మన సమాజంలో ఆడ, మగ రెండు పూర్తిగా విభిన్నమైన జాతులని ఆమె తెలిపారు. సినీ ఇండస్ట్రీ మహిళలకు పూర్తిగా సురక్షితమైన ప్రదేశం కాదని.. తాను 18 ఏళ్లకే అసౌకర్యకర పరిస్థితిని ఎదుర్కొన్నానని వెల్లడించారు.

# ఎవరితోనూ రిలేషన్ షిప్‌లో లేను: శ్రుతి హాసన్

సంచలన నటీమణుల్లో శ్రుతి హాసన్ ఒకరిని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. అంతే కాదు చాలా బోల్ నటి కూడా. ప్రేమ, పెళ్లి విషయంలో చాలా స్పష్టమైన అభిప్రాయాలను వ్యక్తం చేసే నటి.ప్రఖ్యాత నటుడు, సినీ వికీపీడియా కమలహాసన్ వారసురాలు అయిన శ్రుతి హాసన్ స్వతంత్ర భావాలు కలిగిన నటి. ఆ మధ్య ప్రేమించిన వ్యక్తిని తన తండ్రికి పరిచయం చేసిన గట్స్ ఉన్న నటి ఈ భామ.

హిందీ చిత్ర పరిశ్రమలో కథానాయకిగా ఎంట్రీ ఇచ్చి, ఆ తరువాత తెలుగు, తమిళం భాషల్లో నటిస్తూ క్రేజీ కథానాయకిగా రాణిస్తున్న విషయం తెలిసిందే. అంతే కాకుండా సంగీత దర్శకులు,గాయని అంటూ పలు శాఖల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. ఇటీవల ఈమె నటుడు రజనీకాంత్ తో కలిసి కూలీ చిత్రంలో నటించి మంచి పేరు తెచ్చుకున్నారు.

తమిళంలో విజయ్ సేతుపతి కి జంటగా నటించిన ట్రైన్ చిత్రం త్వరలో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. ఇటీవల కథానాయకిగా బిజీగా లేకున్నా అభిమానులతో తరచూ సోషల్ మీడియా ఇంటరాక్టివ్ అవుతూ తమ భావాలను పెంచుకుంటూ వార్తల్లో ఉంటున్నారు. అలా తాజాగా అభిమానులతో ముచ్చటించారు. అందులో ఒకరు మీరు రిలేషన్ షిప్ లో ఉన్నారా అని అడగ్గా '' నేను రిలేషన్ షిప్ లో లేనని స్పష్టం చేశారు. అదేవిధంగా మీరు సినీ రంగంలో లేకుంటే ఏం చేసేవారు అన్న ప్రశ్నకు పిల్లల మనోతత్వ వైద్యురాలినన్నే దానిని పేర్కొన్నారు. ఈమె వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151, And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.